
# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 31 జూలై 2025 | సంపుటి:9 | సంచిక:214 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## బుకర్స్ లిస్ట్‌లో కిరణ్ పుస్తకం




2



## జీఎస్ఎల్వీ- ఎఫ్16 సక్సెస్‌ఫుల్ లాంచ్

### నిర్దేశిత కక్ష్యలోకి చేరిన భూపరిశీలక ఉపగ్రహం నైసార్

ఇస్రో-నాసా కలిసి అభివృద్ధి పరిచిన ఎర్త్ శాటిలైట్ ఇది

భారత్-అమెరికా సంయుక్త అంతరిక్ష పయనంలో ఈ ప్రయోగం ఫస్ట్ స్టెప్

2

### మాటల్లో మిత్రుడు చేతల్లో సురుకులు..

## భారత్‌పై 25% సుంకాలు

రేపట్నుంచే అమల్లోకి వస్తాయని ప్రకటించిన ట్రంప్

ఇండియాతో తమ వ్యాపారం తక్కువేనని వ్యాఖ్యానించిన అమెరికా అధ్యక్షుడు

న్యూయార్క్, జూలై 30 (మనం న్యూస్): భారత్ మాకు మిత్ర దేశమని ఒక పక్క చెబుతోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో పక్క మనకు రకరకాలుగా సురుకులు పెడుతున్న విషయం చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలోనే తాజాగా ఆయన మనపై ఆర్థిక దాడికి తెగబడ్డారు. భారత్ నుంచి తమ దేశంలోకి దిగుమతి కానున్న మన దేశ వస్తువులపై 25శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. రేపటి (ఆగస్టు 1) నుంచే ఈ ...మిగతా 2లో




### మన ప్రయోజనాలను కాపాడుతం

2

## జాతీయ రహదారుల సమస్యల పరిష్కారానికి కేశినేని శివనాథ్ కృషి

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కీలక భేటీ



ఢిల్లీ, జూలై 30 (మనం న్యూస్): విజయవాడ పార్లమెంట్ పరిధిలోని జాతీయ రహదారుల విస్తరణ, సబ్వేస్లు, సర్వీస్ రోడ్ల ఏర్పాటు కు ఎంపీ కేశినేని శివనాథ్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. కేంద్ర రోడ్లు, రవాణా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తో పార్లమెంట్ లోని ఆయన కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడలోని ప్రధాన రహదారుల సమస్యలు, లోపాలు, ...మిగతా 2లో



### ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అపార వనరులు

## వ్యాపార అభివృద్ధికి పెద్ద ఎత్తున అవకాశాలు

### పెట్టుబడులతో రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కండి

### సింగపూర్‌లోని వివిధ దిగ్గజ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు

అమరావతి, జూలై 30 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అపార వనరులున్నాయని...వ్యాపార అభివృద్ధికి పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడులతో వచ్చి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ...మిగతా 2లో




### బీజేపీ తమిళనాడు ఉపాధ్యక్షురాలిగా ఖుష్బూ



## అల్ ఖైదా మాస్టర్ మైండ్ అరెస్టు

గాంధీనగర్, జూలై 30: అల్ ఖైదా టెర్రర్ మాడ్యూల్ మాసర్ మైండ్ షామా పర్వీన్ ను గుజరాత్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ అదుపు లోకి తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పర్వీన్ను కర్ణాటకలోని బెంగళూరులో అరెస్టు చేసినట్లు తెలిపారు. దేశంలో ఉగ్రవాదులకు మద్దతిస్తున్నవారిని గుర్తించడానికి అధికారులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్లో భాగంగానే ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## భారీ వర్షాలతో అమర్‌నాథ్ యాత్రకు అంతరాయంజ



శ్రీనగర్, జూలై 30 (మనం న్యూస్): కశ్మీర్‌లో భారీ వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే పహల్గాం, బల్తాల్ రూట్లను బుధవారం అధికారులు రద్దు చేశారు. ప్రతికూల వాతావరణం కారణంగా జమ్ము నుంచి యాత్రకు వెళ్లే మార్గాన్ని కూడా గురువారం రద్దు చేయనున్నట్టు- అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందున బల్తాల్, స్థావర శిబిరాల నుంచి యాత్రను రద్దు చేయడమైందని , అలాగే భగవత్‌నగర్ నుంచి బల్తాల్, నున్వాన్ శిబిరాల నుంచి గురువారం కూడా యాత్రను రద్దు చేస్తున్నట్టు- డిపిఆర్ డివిజనల్ కమిషనర్ రమేశ్ కుమార్ వెల్లడించారు.

### 127 ఏండ్ల తరువాత భారత్‌కు తిరిగొచ్చిన బుద్ధుడి అవశేషాలు



## కృష్ణా నది వరదలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నాం

### ప్రజలు ధైర్యంగా, జాగ్రత్తగా ఉండాలి

- వరదలపై వదంతులను నమ్మవద్దు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ పశ్చిమ, జూలై 30 (మనం న్యూస్): ఎగువన వర్షాలు పడటంతో పులిచింతల నుంచి 60 వేల క్యూసెక్కులుకు పైగా వరద నీరు రావడంతో.. ప్రకాశం బ్యారేజీ 70 గేట్లలో 55 గేట్లను అడుగుపైకి, 15 గేట్లను రెండు అడుగులు పైకి ఎత్తి నీటిని కిందకు వదిలేయడం జరుగుతోందని.. వరదల నేపథ్యంలో పూర్తి అప్రమత్తంగా ఉన్నామని, అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ లక్ష్మీశ ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ...మిగతా 2లో

## ఏక్ ప్రేమ్ కహానీ

### బందరులో సస్పెన్స్.. థ్రిల్లర్ • ట్విస్టుల మీద ట్విస్టులు

అటు ప్రేమికులకు... ఇటు పొలిటికల్ అటెన్షన్

మధ్యన పోలీసులకు హై టెన్షన్

చట్టం తన పని తాను చేయదా?

పరామర్శాలకు నేతల ఔత్సాహం

ఈ లవ్ స్టోరీ ఎటు మలుపు తిరుగుతుందో



విజయవాడ, జూలై 30(మనం ప్రత్యేక ప్రతినిధి): బందరు ప్రేమ కథ చిత్రమ్..లో ట్విస్టుల మీద ట్విస్టులు సస్పెన్స్ థ్రిల్లర్ ను తలపిస్తోంది. ఈ లవ్ కథ క్లైమాక్స్ లో ఏ పక్షానికి శుభం కార్డు పడుతుందోనని ఇటు రాజకీయ పక్షాలు.. అటు బాధిత వర్గం మధ్యలో పోలీసులు నరాలు తెగే ఉత్కంఠతను చవి చూస్తున్నారు. ఐదు రోజుల కిందట బందరు నుంచి ఎగిరిపోయిన ఈ ప్రేమ పక్షుల కోసం పోలీసులు జల్లెడ పట్టి ఒడిషా పూరిలో జాడ కనిపెట్టి.. మంగళవారం బందరుకు చేర్చారు. ఇక్కడ నుంచే అసలు క్లైమాక్స్ తెరమీదకు వచ్చింది. ప్రేమికుడి తండ్రి రంగంలోకి దిగారు. కొడుకుకు భవిష్యత్తు చిత్రాన్ని చూపించాడు. అంతే ప్రేమ విహారంలో ఐదు రోజులు ప్రేయసితో సయ్యాటలాడిన ప్రేమికుడికి అకస్మాత్తుగా ...మిగతా 2లో


## పాశమైలారంలో పేలుడు

సంగారెడ్డి, జూలై 30: పాశమైలారం పారిశ్రామికవాడలో బుధవారం ఉదయం పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. రసాయన డ్రమ్ములు తగలబెడుతుండగా పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

### రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై కొనసాగుతున్న చర్చ

## బుల్లెట్ పేల్చిన వారికి.. కాంగ్రెస్ బిర్యానీ పెట్టింది

- మోడీ హెచ్చరించారు.. మూడ్రోజుల్లోనే సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయి
- కేంద్ర మంత్రి జేపీ నడ్డా



ఢిల్లీ, జూలై 30 (మనం న్యూస్): కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో బాంబు పేలుళ్లు జరగని నగరమే లేదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. వారి హయాంలో ఉగ్రవాదాన్ని చూసీచూడనట్లుగా వదిలేశారని మండిపడ్డారు. రాజ్యసభలో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చలో భాగంగా ఆయన ప్రసంగించారు. 'పహల్గాం దాడి, అనంతరం చర్యలపై ఇప్పుడు కేంద్రాన్ని ప్రశ్నిస్తున్న వారు.. గతంలో వారి పాలనను గుర్తుచేసుకోవాలి. వారి హయాంలో ...మిగతా 2లో

### ఎపి లిక్కర్ కుంభకోణంలో కీలక మలుపు

## సిట్ దాడుల్లో హైదరాబాద్ శివారులో భారీగా డబ్బు పట్టివేత

12 బాక్సుల్లో భద్ర పరిచిన రూ.11 కోట్ల నగదు సీజ్

హైదరాబాద్, జూలై 30 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన లిక్కర్ కుంభకోణంలో కీలక ...మిగతా 2లో

### మీ ప్రవర్తన నమ్మశక్యంగా లేదు

జస్టిస్ యశ్వంత్ వర్మపై సుప్రీం అసహనం



## రష్యాలో భారీ భూకంపం



### రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 8.8గా నమోదు

సునామీ హెచ్చరికల జారీ

రష్యా తీరంతో పాటు, జపాన్‌పైనా ప్రభావం

సైరన్ల మోతతో వీధుల్లోకి వచ్చిన జనం

మాస్కో: రష్యాలో భారీ భూకంపం బుధవారం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 8.8గా నమోదైంది. రష్యా తీరంలోని కమ్చట్కా ద్వీపకల్పంతో పాటు- జపాన్‌కు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. 3 మీటర్ల ఎత్తులో అలలు వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అమెరికాలో 2011లో ...మిగతా 2లో

## భారతీయులను హెచ్చరించిన కాన్సులేట్ జనరల్

న్యూయార్క్, రష్యాలో బుధవారం ఉదయం భారీ భూకంపం సంభవించడంతో రష్యా, జపాన్‌తో పాటు ఉత్తర పసిఫిక్‌లోని పలు తీర ప్రాంతాలను సునామీ తాకింది. ఈ నేపథ్యంలో అమెరికాలోని భారత కాన్సులేట్ జనరల్ అప్రమత్తమైంది. ప్రజలంతా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. సునామీ ముప్పును శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. కాలిఫోర్నియా, హవాయితో పాటు అమెరికా పశ్చిమ తీర రాష్ట్రాల్లో నివసిస్తున్న భారత పౌరులు ...మిగతా 2లో

## ఈడీ విచారణకు హాజరైన ప్రకాశ్ రాజ్



హైదరాబాద్, జూలై 30: సినీనటుడు ప్రకాశ్ రాజ్ బుధవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగిన కేసును ఈడీ దర్యాప్తు చేస్తుండడం పాఠకులకు విదితమే. ఆగస్టు 6న విజయ్ దేవరకొండ, 11న రానా, 13న మంచు లక్ష్మి విచారణకు హాజరు కానున్నారు.

## సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేతతో పాక్‌కు షాక్

ఢిల్లీ, జూలై 30: పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని వదిలి పెట్టేవరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని బుధవారం రాజ్యసభలో విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టంచేశారు. నీరు, రక్తం కలిసి ప్రవహించవని మరోసారి తేల్చిచెప్పారు. ఈ ఒప్పందం కుదుర్చుకొన్న ...మిగతా 2లో

## మరికొన్ని దేశాలకు సునామీ హెచ్చరికలు

న్యూయార్క్, జూలై 30 (మనం న్యూస్): రష్యాలోని కామ్చాట్కా ద్వీపకల్పంలో సంభవించిన భూకంపం ప్రభావంతో రష్యా, జపాన్ తీర ప్రాంతాలను సునామీ తాకింది. పలుచోట్ల రాకాసి ...మిగతా 2లో

## అమెరికా తీర ప్రాంతాలకు వార్నింగ్

### స్థానిక అధికారుల సూచనలు పాటించాలని సూచించిన ట్రంప్

న్యూయార్క్, జూలై 30: తాజా పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. పసిఫిక్ మహా సముద్రంలో భారీ భూకంపం కారణంగా హవాయి ప్రాంతానికి సునామీ అలర్ట్ జారీ అయ్యింది. అమెరికాలోని పసిఫిక్ తీర ప్రాంతాలకూ ముప్పు పొంచి ఉంది. ప్రజలంతా ధైర్యంగా ఉండండి. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లండి. అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు పాటించండని అధ్యక్షుడు సూచించారు.

# జాతీయ రహదారుల సమస్యల పరిష్కారానికి కేశినేని శివనాథ్ కృషి

(మొదటి పేజీ తరువాయి)

అలాగే ప్రజల ప్రయాణ భద్రతకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తో చర్చించి నాలుగు అంశాలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రాలు అందజేశారు. విజయవాడ-హైదరాబాద్ మధ్య జాతీయ రహదారి మార్గాన్ని మెరుగుపరచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ రహదారి ఎన్ హెచ్-65లోని 238 కిలో మీటర్ల పైగా (విజయవాడ వెస్టర్న్ బైపాస్) నుండి 270 నుండి 500 కిలోమీటర్ల (పున్నమి ఘాట్, భవానీపురం) వరకు మొత్తం 33 కిలోమీటర్ల పొడవు గల మార్గాన్ని ఆరు లైన్లుగా విస్తరించాల్సిన అవసరం గురించి వివరించారు. ఎన్.హెచ్.ఎ.ఐ సంస్థ 40 కిలో మీటర్ల నుండి 270 అంతకంటే పైన అంటే 500 కిలో మీటర్ల వరకు 6 లైన్ల విస్తరణకు డి.పి.ఆర్ సిద్ధం చేస్తోందని..ఆ ప్రతిపాదన ప్రకారం 6 లైన్ల ప్రణాళికను 238 కిలోమీటర్ల వరకు మాత్రమే పరిమితం చేయడం వల్ల, భవిష్యత్తులో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురుకావటంతో పాటు,ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. విజయవాడ వెస్ట్ బైపాస్ రహదారి ప్యాకేజీ 3 (పెద్దావుటుపల్లి - గొల్లపూడి)లో రెండు వైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం గురించి కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కి వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన కాజా-గుండుగోలాను విజయవాడ బైపాస్ ప్రాజెక్టు నాలుగు ప్యాకేజీలుగా విభజించగా ప్యాకేజీ 3లో మాత్రం రెండు వైపులా సర్వీస్ రోడ్లను కల్పించలేదని తెలియజేశారు. ఈ రహదారి పల్లె ప్రాంతాలను విజయవాడ నగరానికి, రాజధాని అమరావతికి కలిపే దారిగా పనిచేస్తోందని తెలిపారు . ఇక్కడి ప్రజలు వ్యవసాయ వాహనాలతో, బుల్కార్లతో తరచూ ప్రయాణిస్తుంటారు. ఆ వాహనాలతో హైవే ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందువల్ల సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయించాలని కోరారు. గొల్లపూడి జంక్షన్ నుండి జక్కంపూడి గ్రామం వరకు 5.5 కిలోమీటర్ల నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర రోడ్ల మౌలిక సదుపాయాల నిధి ద్వారా మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారి మచిలీపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్ హెచ్-65), నాగ్పూర్-విజయవాడ గ్రీన్ఫీల్ హైవే (ఎన్ హెచ్ -163ఎ), చెన్నై-కొల్కతా జాతీయ రహదారి (ఎన్ హెచ్ -16), విజయవాడ ఇన్నర్ రింగ్ రోడ్ మరియు జక్కంపూడి ఎకనామిక్ సిటీ రోడ్లను కలుపుతుందని వివరించారు.

# వ్యాపార అభివృద్ధికి పెద్ద ఎత్తున అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

సింగపూర్‌లోని వివిధ దిగ్గజ సంస్థల ప్రతినిధులను కోరారు. సింగపూర్ పర్యటన చివరి రోజున పలు కంపెనీలకు చెందిన ప్రముఖులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దిశగా ప్రభుత్వం రూపొందించుకున్న ప్రణాళికలను ఆయా సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. వివిధ రంగాల్లో భారీ ఎత్తున పెట్టు-బడులు పెట్టి...కీలక కంపెనీలుగా ఉన్న కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా), మండాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్, సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్, టెమసెక్ హోల్డింగ్స్ వంటి సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వేర్వేరుగా భేటీ- అయ్యారు. రియలెస్టేట్ ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ పార్కులు, డేటా సెంటర్లు, గ్రీన్ బిల్డింగ్స్, డిజిటల్ టౌన్ షిప్స్ వంటి అంశాలపై కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ప్రతినిధులు సంజీవ్ దాస్ గుప్తా, గౌరీశంకర్ నాగభూషణంలతో సీఎం చర్చించారు. అమరావతి, విశాఖ, తిరుపతి వంటి నగరాల్లో ఐటీ- పార్కులు, ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో కూడిన వర్క్ స్టేషన్ల ఏర్పాటు-కు అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వారికి వివరించారు. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టుల ద్వారా అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకున్నామనే అంశాన్ని సీఎం చర్చించారు. హైదరాబాద్-బెంగళూరు- అమరావతి- చెన్నైల మధ్య ఎయిర్ పోర్టు ఎకనమిక్ కారిడార్ గురించి సీఎం ఆ సంస్థ ప్రతినిధులకు చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఉన్న మొత్తం ఐటీ- పార్కుల్లో 30-35 శాతం ఐటీ- పార్కుల్లో తాము పెట్టుబడులు పెట్టామని ఆ సంస్థ ప్రతినిధులు చంద్రబాబు దృష్టికి తెచ్చారు. రియల్ ఎస్టేట్ సహా పారిశ్రామిక రంగాల్లో ఏపీలో పెట్టు-బడులు పెట్టేందుకు కెపిటాల్యాండ్ ఇండియా ప్రతినిధులు ఆసక్తి కనబరిచారు. మండాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ సంస్థతో జరిగిన సమావేశంలో వైల్డ్ లైఫ్ పార్కులు, ఎకో టూరిజం, బయో డైవర్సిటీ- కాంప్లెక్సులు, వైల్డ్ లైఫ్ ఎక్స్ పీరియెన్స్ జోన్ల ఏర్పాటు- వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. వైజాగ్, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఎకో టూరిజం రంగంలో భాగస్వామ్యంతో వెళ్తే మంచి చక్కటి అభివృద్ధి సాధించవచ్చని ఆ గ్రూప్ సీఈఓ మైక్ బార్క్లేకు సీఎం సూచించారు. సింగపూర్ గార్డెన్ సిటీ-, జూ పార్క్ మోడళ్లను ఏపీలో అమలు చేసే అంశంపై సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది.

# కృష్ణా నది వరదలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితిని పరిశీలించారు. అధికారుల నుంచి వరద నీటి ప్రవాహానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువారం ఉదయం నాటికి లక్ష క్యూసెక్కులకు, రెండు రోజుల్లో మూడు లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశముందని, ఈ నేపథ్యంలో కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉన్నారని.. బ్యారేజీ ఎగువ, దిగువ వైపుల ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. ముఖ్యంగా మత్స్యకారులను చేపల వేటకు వెళ్లకుండా అవగాహన కల్పించామన్నారు. విజయవాడలో దాదాపు 43 లోతట్టు ప్రాంతాలను గుర్తించామని.. వీటిని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సమీపంలో పునరావాస కేంద్రాలతో మ్యాప్ చేసినట్లు తెలిపారు. ఒకవేళ ముంపు ముప్పు ఉన్నట్లయితే ఈ కేంద్రాలను తరలిస్తామని వివరించారు. డ్రెయినేజీ వ్యవస్థలు సరైన విధంగా ఉండేలా నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బుడమేరు, పులివాగు, కోతుల వాగు తదితర ప్రాంతాల విషయంలోనూ అప్రమత్తంగా ఉన్నామన్నారు. వరదలపై జిల్లా కలెక్టరేట్లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని.. ఇది 24 గంటలూ పనిచేస్తుందని, ఎవరైనా సమస్యలను కంట్రోల్ రూమ్ దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని.. వచ్చే రెండు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. భయపడాల్సిన పనిలేదని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతోనూ సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్ఈ ఆర్.మోహనరావు, ఈఈ ఆర్.రవికిరణ్, డీఈ ఎన్.అజయ్బాబు, బ్యారేజ్ జేఈ సత్య రాజేష్ తదితరులు ఉన్నారు.

# సిట్ దాడుల్లో హైదరాబాద్ శివారులో భారీగా డబ్బు పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

మలుపు చోటుచేసుకుంది. మద్యంకేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో కొత్త కోణాలు బయటపడుతున్నాయి. నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టిన సిట్ అధికారులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. రాజ్ కెసిరెడ్డి సూచన మేరకు 12 బాక్సుల్లో భద్ర పరిచిన రూ.11 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారంలోని సులోచన ఫార్మ్ గెస్ట్ హౌస్‌లో అక్రమ మద్యం నగదు డంప్‌ను గుర్తించారు. లిక్కర్‌స్కామ్‌లో ఏ-40 వరుణ్ పురుషోత్తం నోట సంచలన నిజాలు వెల్లడయ్యాయి. అతని వాంగ్మూలం ఆధారంగా తనిఖీలు చేపట్టిన అధికారులకు భారీగా నగదు పట్టు-బడింది. నగదు సీజ్ ఘటనలో చాణక్య, వినయ్ పాత్రపైనా సిట్ బృందం విచారణ చేపట్టింది. రాజ్ కెసిరెడ్డి, చాణక్య ఆదేశాల మేరకు జూన్ 2024లో వినయ్ సాయంతో వరుణ్ రూ.11 కోట్ల నగదు ఉన్న 12 అట్ట పె-టటె-లను ఆఫీస్ ఫైళ్ల పేరుతో దాచినట్టు- సిట్ అధికారులు గుర్తించారు. నిన్న దుబాయ్ నుంచి వచ్చిన వరుణ్ పురుషోత్తమ్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏపీ మద్యం స్కామ్‌లో రాజ్ కెసిరెడ్డి వసూళ్ల బృందంలో వరుణ్ కీలక వ్యక్తి. అతడి నుంచి సిట్ అధికారులు కీలక సమాచారం రాబట్టారు. వరుణ్‌పై విజయవాడ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేసింది.

# ఏక్ ప్రేమ్ కహానీ

(మొదటి పేజీ తరువాయి)

కెరీర్ గుర్తుకు వచ్చింది. రెండేళ్లు తరువాత పెళ్లి చేసుకుంటానని మరో చరిత్ర సినిమాలో ప్రేమ కథను అన్వయించాడు. ఇక ఆ బాధితురాలికి చుక్కలు కనిపించాయి. పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతానని భీష్మించింది. ఇంతలో పోలీసులు యథారాజ తథా ప్రజ పాత్రకు రెడీ అయ్యారు. ఈ రెండు కుటుంబాల మధ్య రాజీ మంత్రం ప్రయోగించారు. ఇందులో సామదాన బేధ దండోపాయాలు సరేసరి. ఇంకేముందీ.. తన బిడ్డకు న్యాయం జరగదనే ఆందోళనతో ప్రేయసి తల్లి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా.. ఈ పోలీసు స్టేషన్ లో డీల్ సీన్ .. కీలక మలుపు తిరిగింది. తల్లి ఆసుపత్రి పాలు కావటంతో.. ఇటు కుల పెద్దల రాజీతంత్రం, అటు పొలిటికల్ రగడ సీన్ తెరమీదకు వచ్చాయి. ఇప్పుడు ఈ లవ్ స్టోరీ ఎటు మలుపు తిరుగుతుందో.. పరిశీలిద్దాం.

### చట్టం తన పని తాను చేయదా?

ఔను బందరు టీడీపీ నేత పల్లపాటి సుబ్రహ్మణ్యం ప్రియతమ తనయుడు అభినవ్ కు యుక్త వయస్సు వచ్చింది. డిగ్రీ చదివిన జాహ్నవి అంటే ఆశ రగిలింది. అది ప్రేమగా మారింది. ఇద్దరు మేజర్లే. తమ భవిష్యత్తును నిర్ణయించుకునే స్థాయికి ఎదిగినోళ్లే. ఇక పెళ్లే తదుపరి లక్ష్యం. ఆస్తులు, అంతస్తుల ఆంతర్యం సరిపోలేదు. కానీ ప్రేమ ఏకం చేసింది. పెద్దలు తమ పెళ్లిని అంగీకరించరని గ్రహించి.. ప్రేమ జంట ఎగిరిపోయింది. ఐదురోజుల సరస సల్లాపాల సయ్యాటకు పోలీసుల బ్రేక్ పడింది. ఇక పోలీసు స్టేషన్ సాక్షిగా.. పంచాయితీకి తెరలేసింది. పెళ్లికి అడ్డంకులు తప్పలేదు. ఇప్పుడు తనను నమ్మి ఇల్లు కదిలిన జాహ్నవికి రెండేళ్ల విరామం ప్రకటించటమే అభినవ్ ఎదుట లక్ష్యంగా మారింది. అంటే ఆ తరువాత జాహ్నవి దారి జాహ్నవిది.. అభినవ్ దారి అభినవ్ దే. ఇదీ పోలీస్ స్టేషన్ లో డీల్. నిజానికి ఓ సామాన్య కుటుంబానికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరిట ఓ యువతిని తీసుకువెళ్లి.. పెళ్లికి ముందే శోభనం చేసుకుని.. ఆ తరువా బ్రేకప్ చెబితే.. న్యాయమేనా? బాధితురాలు పోలీసు గడప ఎక్కితే.. పోలీసులు ఊరుకుంటారా? ఆ యువకుడిని తీసుకువచ్చి .. కిడ్నాప్, రేప్ కేసు పెట్టరా? కచ్చితంగా అదే జరుగుతుంది. మరి టీడీపీ నాయకుడి కొడుకు విషయంలో.. చట్టం తన పని తాను చేస్తుందని ఎందుకు పోలీసులు వ్యవహరించటం లేదు. ఔను.. ఇద్దరూ మేజర్లే కాబట్టి పోలీసు స్టేషన్ సాక్షిగా పెళ్లి చేయవచ్చు. కానీ ఇక్కడే ఏదో తిరకాసు పోలీసులకు బేడీలు వేస్తోంది.



### పొలిటికల్ ట్రెండ్..

నిన్నా మొన్నటి వరకూ వివిధ కేసుల గోలలో.. బయటకు కానరాని వైసీపీ నేతలు అకస్మాత్తుగా బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యక్షం అయ్యారు. ఆత్మహత్యకు యత్నించిన జాహ్నవి తల్లిని పరామర్శించారు. మహిళలకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఇక బందరు రోడ్డులో .. నిన్నటి వరకూ అటు వైసీపీ, ఇటు టీడీపీ నేతలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు.. ఇప్పుడు టీడీపీ తనయుడి రాస క్రీడ కు వ్యతిరేక పోరాటంగా మారిపోతుంది. మంత్రి కొల్లు రవీంద్ర పేరు నడివీధికి చేరుతుంది. ఫలితంగా.. పల్లపాటి అభినవ్ జైలుకు.. జాహ్నవి హాస్టలుకు చేరుతుంది. అంటే ప్రేమను నమ్మిన ఆడబిడ్డకే అన్యాయం జరుగుతుంది. ఆడపిల్లలకు అన్యాయం జరిగిందనే వార్తలు రాగానే.. ప్రతిపక్ష పార్టీ మహిళ నేతలు గరం గరం కావటం సహజం. మీడియాలో ఆగ్రహావేశాలు వెళ్లగక్కటమూ సాధారణమే. కానీ.. ఇలాంటి సున్నిత అంశాల్లో అధికారంలోని మహిళ కమిషన్ చైర్ పర్సన్, రాష్ట్ర హోంమంత్రి స్పందించక పోవటంతోనే అనర్థాలు తప్పటం లేదు. ఇదే ఘటనలో జాహ్నవి తల్లి చనిపోతే,, అప్పుడు అధికార పార్టీ మహిళలు గొంతు చించుకుంటారా? ఇదీ సామాన్యుల ప్రశ్న.

# భారత్‌పై 25% సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

కొత్త పన్నుల విధింపు అమల్లోకి వస్తుందని తెలిపారు. అమెరికా వస్తువులపై భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తోందన్నారు. రష్యా నుంచి భారత్ ఎక్కువగా సైనిక ఉత్పత్తులు కొంటోందని, ముఖ్యంగా చమురును అధికంగా దిగుమతి చేసుకుంటుందని చెప్పారు. ఈ కారణంగానే మన వస్తువులపై అధిక సుంకాలు వసూలు చేయనున్నట్టు పరోక్షంగా తెలియజేశారు. మిత్రదేశమైనప్పటికీ భారత్ తో తమ వ్యాపారం తక్కువేనని ట్రంప్ వ్యాఖ్యానించడం ఈ సందర్భంగా గమనార్హం. ''భారత్ మిత్రదేశమే అయినా.. సుంకాలు ఎక్కువగా ఉన్నందున వారితో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నాం. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. ఏ దేశంలో లేని విధంగా వాణిజ్యపరంగా అక్కడ అడ్డంకులున్నాయి. రష్యా నుంచి భారీ స్థాయిలో సైనిక ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్ దాడులను ప్రపంచమంతా ఖండిస్తోంది. భారత్, చైనాలు మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నాయి. అందుకే భారత్ పై 25శాతం సుంకాలు అదనంగా పెనాల్టీ కూడా విధిస్తున్నాం. ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయి'' అని 'ట్రూత్ సోషల్' వేదికగా ప్రకటించారు. ఇటీవల భారత్ సహా పలు దేశాలపై ప్రతీకార సుంకాలు ప్రకటించిన ట్రంప్.. ఆగస్టు 1ని డెడ్ లైన్ గా విధించిన విషయం తెలిసిందే. వీటికి సంబంధించి ఏప్రిల్లోనే ప్రకటన చేసినప్పటికీ.. చర్చల కోసం వీటి అమలుకు గడువు ఇచ్చారు. ఇక భారత్ పై సుంకాల విషయంలో ఇటీవల స్కాట్లాండ్ పర్యటన సందర్భంగా మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్ సుంకాలు విధిస్తోందని, అలా చేయడం తగదన్నారు. నేడు ఈ చర్యలకు ఉపక్రమించారు.

# బుకర్స్ లిస్ట్‌లో కిరణ్ పుస్తకం/బుక్

**లండన్:** భారతీయ ఆంగ్ల రచయిత్రి కిరణ్ దేశాయ్ రచించిన 'ది లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సోనీ' ప్రఖ్యాత బుకర్ ప్రైజ్‌లో చోటు దక్కించుకుంది. మంగళవారం ప్రకటించిన ఈ జాబితాలో వివిధ దేశాలకు చెందిన ఏడుగురు మహిళలు, ఆరుగురు పురుషులు రచించిన దీర్ఘకాల కాల్పనిక 13 నవలలు ఉన్నాయని బుకర్ ప్రైజ్ ఫౌండేషన్ వెల్లడించింది. ఈ జాబితాలో దేశాయ్ రచించిన పుస్తకం 650 పేజీలతో అతి పెద్దది కాగా.. నటాషా బ్రౌన్ రాసిన 'యూనివర్సాలిటీ' 156 పేజీలతో అతి చిన్నది. అవార్డు ప్రకటన కార్యక్రమం లండన్‌లో నవంబరు 10న జరగనుంది. కిరణ్ దేశాయ్ రాసిన 'ది ఇన్హెరిటెన్స్ ఆఫ్ లాస్' నవల 2006లో బుకర్ ప్రైజ్ గెలుచుకున్న విషయం తెలిసిందే.

# జీఎస్ఎల్వీ- ఎఫ్16 సక్సెస్‌ఫుల్ లాంచ్

**తిరుపతి, జూలై 30:** అంతరిక్ష రంగంలో భారత్ శిగలో మరో కలికితురాయి చేరింది. 'నైసార్ (ఎన్ఐఎస్ఏఆర్.. నాసా, ఇస్రో సింథటిక్ ఎపెర్చర్ రాడార్)' భూపరిశీలక ఉపగ్రహ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. షార్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్16 వాహక నౌక.. 2,393 కిలోల బరువున్న 'నైసార్' ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా సంయుక్తంగా అభివృద్ధి పరిచిన తొలి ఉపగ్రహమైన ఇది.. అంతరిక్షంలోకి ఇప్పటివరకు చేర్చిన అత్యంత శక్తిమంతమైన ఎర్త్ శాటిలైట్‌గానూ రికార్డులకెక్కింది. ఈ ఉపగ్రహాన్ని ఇస్రో, నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసినందున నైసార్ (నాసా-ఇస్రో సింథటిక్ అపర్చర్ రాడార్) అని పేరు పెట్టారు.

రెండు సింథటిక్ అపర్చర్ రాడార్లు (సార్) అమర్చిన తొలి ఉపగ్రహం ఇదే కావడం మరో విశేషం. ఈ రెండు రాడార్లు భారీ డిష్ ఆకారంలో ఉంటాయి. ఇవి భూమి పైకి మైక్రోవేవ్, రేడియో సంకేతాలు పంపి.. తిరిగివచ్చిన వాటిని విశ్లేషించి చిత్రాలను తయారుచేస్తాయి. ఈ యాంటీన్నా 12 చదరపు మీటర్ల వైశాల్యం ఉటుంది. దీనిని మడతపెట్టి అంతరిక్షంలోకి పంపిస్తారు. ఇది భూమిపై దాదాపు 20 కిలోమీటర్ల వైశాల్యంలోని ప్రదేశాలను చిత్రీకరించగలదు. ఇస్రోకు చెందిన రీశాట్ సిరీస్ లో ఒక 'సార్'ను అమర్చిన ఉపగ్రహాలు ఇప్పటికే అంతరిక్షంలో ఉన్నాయి. రెండు రాడార్లలో ఒకటి ఎల్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీ, మరొకటి ఎస్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీల్లో పనిచేస్తాయి. ఒకే ప్రదేశానికి సంబంధించి ఏకకాలంలో వేర్వేరు చిత్రాలను తీస్తాయి. ఈ రాడార్లు పగలు, రాత్రి తేడా లేకుండా మేఘాలు, పొగ, వర్షం, పొగమంచులో స్పష్టంగా ఫొటోలను ఇవ్వగలవు. ఏకకాలంలో వందలాది అగ్నిపర్వతాల్లో మార్పులను గమనించగలవు. పంట పొలాలు, నీటి వనరులు వంటి వాటిని చిత్రీకరించగలవు. నైసార్ రాడార్లు ప్రతి 12 రోజులకు రెండుసార్లు భూమి మొత్తాన్ని కవర్ చేస్తాయి. ఇది అందించే సమాచారంతో పంటలు, ప్రకృతి విపత్తులు, భూకంపాలు, హరికేన్లను అంచనావేయగలం. ఈడేటా ఆధారంగా ప్రభుత్వాలు తగు నిర్ణయాలు, చర్యలు చేపడతాయి.

# మన ప్రయోజనాలను కాపాడుతం

- **అవసరమైన అన్నిచర్యలూ తీస్కుంటమని కేంద్రం ప్రకటన**

**ఢిల్లీ, జూలై 30:** 25 శాతం సుంకాలు విధిస్తూ చేసిన ప్రకటనపై భారత్ స్పందించింది. ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావం ఏ మేరకు ఉంటుందనేదానిపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. రైతులు, వ్యాపారవేత్తలతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది.

# బుల్లెట్ పేల్చిన వారికి.. కాంగ్రెస్ బిర్యానీ పెట్టింది

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ, వారణాసి, ముంబయి వంటి పలు చోట్ల బాంబు పేలుళ్లు సంభవించాయి. అప్పట్లో పేలుళ్లు జరగని నగరమనేదే లేకుండా పోయింది. వందల మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ.. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పాకిస్తాన్ పై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదు. మనపై బుల్లెట్లు పేల్చిన వారికి కాంగ్రెస్ బిర్యానీ పెట్టింది. ఉగ్రదాడులు చేస్తున్న వారితో వాణిజ్య బంధాలు పెంచుకుంది'' అని జేపీ నడ్డా మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉగ్రదాడుల ఘటనలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. 'ఉరిలో ఉగ్రదాడి తర్వాత ప్రధాని మాట్లాడుతూ.. బాధ్యులకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మూడు రోజుల తర్వాత మెరుపుదాడులు చేపట్టి ఉగ్ర లాంఛ్ ప్యాడ్లను భారత్ ధ్వంసం చేసింది. ఉగ్రవాదం విషయంలో భారత వైఖరి మారిందని చెప్పేందుకు ఆ ఘటనే ఉదాహరణ. మన ప్రతిస్పందన ఎలా ఉంటుందో శత్రువులకు ఈపాటికే అర్థమై ఉంటుంది' అని నడ్డా పేర్కొన్నారు.

# సింధూ జలాల ఒప్పంద అమలు నిలిపివేతతో పాక్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో అధికారంలో ఉన్నవారు భారత రైతుల కంటే పాకిస్థాన్ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని దుయ్యబట్టారు. అలాగే గత కాంగ్రెస్ పాలనలో తీసుకున్న నిర్ణయాలను తప్పుపట్టారు. '60 ఏళ్లపాటు మాజీ ప్రధాని నెహ్రూ నేతృత్వంలోని ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దలేమని చెప్తూ వచ్చారు. కానీ వాటిని మార్చవచ్చని మోడీ ప్రభుత్వం చూపించింది. అందుకు ఉదాహరణలే.. ఆర్టికల్ 370 రద్దు. ఇప్పుడు సింధూ జలాల ఒప్పందాన్ని సరిదిద్దుతున్నాం' అని వెల్లడించారు. అలాగే పహల్గాం దాడికి కారణమైన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ను తన నివేదికలో ఐరాస తొలిసారి ప్రస్తావించిందని జైశంకర్ వెల్లడించారు.

# రష్యాలో భారీ భూకంపం

(మొదటి పేజీ తరువాయి)





సంభవించిన తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద భూకంపం ఇది అని అధికారులు పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంతాల ప్రజలు అలర్ట్‌గా ఉండాలని రష్యా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. భూకంపాలకు ప్రజలు భయాందోళనతో వీధుల్లోకి పరుగులు తీశారు. ఇళ్లలోని క్యాబినెట్‌లు కూలిపోవడం, అద్దాలు విరిగిపోవడం, రోడ్లపై నిలిపిన కార్లు ఊగడం వంటి సిసి టివి ఫుటేజీలు విడుదల అయ్యాయి. ఈ నెలలో రష్యాలో అనేక భూకంపాలు సంభవించాయి. జూలై 20న రష్యాలో ఒక గంటలోపు ఐదు భూకంపాలు సంభవించాయి. భూకంప తీవ్రతకు పసిఫిక్ మహాసముద్ర తీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. తూర్పు జపాన్ లో రైల్వే సర్వీసులు నిలిపివేశారు. అమెరికా, ఫిలిపీన్స్, ఈక్వెడార్ లకు సునామి హెచ్చరికలు జారీ చేశారు. కాలిఫోర్నియా నుంచి వాషింగ్టన్ వర్క్ సముద్ర తీర ప్రాంతాల్లో అలర్ట్ జారీ చేశారు. యుఎస్ జియోలాజికల్ సర్వే భూకంప వార్తలను ధృవీకరించింది. భూకంపం వలన ఆయా దేశాల ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యానికి తీవ్ర అంతరాయం కలిగింది. రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 8.8గా నమోదైంది. జపాన్ వాతావరణ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈక్రమంలోనే రష్యాలోని కామ్చాట్కా ద్వీపకల్పంతో పాటు- జపాన్‌కు కూడా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ హెచ్చరికలు చేసిన కొద్దిసేపటికే రష్యా, జపాన్‌లను సునామీ తాకింది. జపాన్‌లోని నాలుగు పెద్ద దీవులకు ఉత్తరాన ఉన్న హక్కైడో నుంచి దాదాపు 250 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు- అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలియలేదు. భూప్రకంపనల నేపథ్యంలో పెట్రోపావ్లోవ్ స్కీ- కామ్చాట్ స్కీ నగరంలోని భవనాలు కంపించాయని రష్యా మీడియా తెలిపింది. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి పరుగులు తీసినట్లు పేర్కొంది. కామ్చాట్స్కీ ప్రాంతంలో విద్యుత్, సెల్‌ఫోన్ సేవల్లో అంతరాయాలు ఏర్పడినట్లు- వివరించింది. అత్యవసర సేవల కోసం ఒక టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటుచేసినట్లు- జపాన్ ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రకంపనలకు సంబంధించిన తీవ్రతను తెలిపే వీడియోలు తాజాగా బయటకు వచ్చాయి. ప్రపంచంలోనే ఈ స్థాయిలో భూకంపం రావడం 2011 తర్వాత మళ్లీ ఇప్పుడే. సునామీ హెచ్చరిక సైరన్లు మోగడంతో భయాందోళనకు గురైన ప్రజలు నివాస ప్రాంతాలను వీడుతున్నారు. స్థానిక గవర్నర్ వాలెరీ లిమారెంకో ప్రకారం.. సునామీ మొదట రష్యాలోని కురిల్ దీవులలోని ప్రధాన స్థావరమైన సెవెరో-కురిల్స్క్ తీర ప్రాంతాన్ని తాకింది. ఇక్కడి ఓడరేవు మునిగిపోయింది. ఈ ప్రాంతంలో దాదాపు 2వేల మంది ప్రజలు నివసిస్తున్నారని రష్యా అత్యవసర మంత్రిత్వశాఖ తెలిపింది. వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు- వెల్లడించింది. సఖాలిన్ ద్వీపంలోని నివాసితులను ఖాళీ చేస్తున్నామని, అత్యవసర సేవలు పూర్తిసామర్థ్యంతో పనిచేస్తున్నాయని స్థానిక రష్యన్ అధికారి తెలిపారు. ఇక, సునామీ కారణంగా జపాన్‌లో 3 మీటర్ల వరకు అలలు ఎగసిపడుతున్నాయని అక్కడి వాతావరణ శాఖ తెలిపింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఎవరూ సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరికలు చేసింది.

# మరికొన్ని దేశాలకు సునామీ హెచ్చరికలు

(మొదటి పేజీ తరువాయి)

అలలు ఎగసిపడుతున్నాయి. అయితే, వీటితో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు, దీవులకు సునామీ ముప్పు పొంచి ఉంది. అమెరికా సునామీ వార్నింగ్ సిస్టమ్ ఆయా దేశాలకు హెచ్చరించింది. 3 మీటర్ల కంటే ఎత్తయిన అలలు ఎగసిపడే అవకాశం ఉన్న దేశాల్లో ఈక్వెడార్, రష్యా, వాయువ్య హవాయి దీవులున్నట్టు తెలిపింది. 1 నుంచి 3 మీటర్ల ఎత్తులో అలలు ఎగసిపడే ముప్పు ఉన్న ప్రాంతాల్లో చిలీ, కోస్టారికా, ఫ్రెంచ్ పాలినేషియా, గువామ్, హవాయి, జపాన్, జార్విస్ ఐలాండ్, జాన్స్టన్ అటోల్, కిరిబాటి, మిడ్వే ఐలాండ్, పాల్మిరా ఐలాండ్, పెరూ, సమోవా, సోలోమన్ దీవులున్నాయంటూ ప్రకటించింది.

0.3 నుంచి 1 మీటరు ఎత్తు వరకు అలలు వచ్చే అవకాశం ఉన్న జాబితాలో అంటార్కిటికా, ఆస్ట్రేలియా, చుక్, కొలంబియా, కుక్ దీవులు, ఎల్ సాల్వడార్, ఫిజీ, గ్వాటెమాలా, ఇండోనేషియా, మెక్సికో, న్యూజిలాండ్, నికరాగ్వా, పనామా, పపువా న్యూగినీ, ఫిలిప్పీన్స్, తైవాన్ తదితర దేశాలున్నాయి.బ్రూనై, చైనా, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, మలేసియా, వియత్నాం దేశాల్లో 0.3 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో అలలు వచ్చే అవకాశాలున్నాయని అది తెలిపింది.

# భారతీయులను హెచ్చరించిన కాన్సులేట్ జనరల్

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అమెరికా అధికారులు జారీ చేసే అలర్ట్‌లను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పాటించాలి. సునామీ హెచ్చరికలు జారీ అయితే.. వెంటనే ఎత్తైన ప్రాంతాలకు తరలి వెళ్లండి. తీర ప్రాంతాలకు దూరంగా ఉండండి. అత్యవసర పరిస్థితికి సిద్ధమవ్వండి. మీ ఎలక్ట్రానిక్ పరికరాలకు ఛార్జింగ్ ఉండేలా చూసుకోండి. సాయం కోసం ఎమర్జెన్సీ నంబర్లను సంప్రదించండని కాన్సులేట్ జనరల్ 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది.

# వడ్డికాసుల వాడికి కాసుల వర్షం

## భారీగా పెరిగిన హుండీ ఆదాయం





**తిరుమల, జూలై 30, మనం న్యూస్ :** గోవింద అంటే పాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. కోరిన కోర్కెలు తీర్చే కోనేటి రాయుడు, సప్తగిరుల్లో వెలసిన గోవిందుడి. ఇలా శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని భక్తులు అనేక నామాలతో కొలుస్తారు. అందుకే రోజులు, వారాలతో సంబంధం లేకుండా తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు క్యూ కడుతున్నారు.

భక్తుల రద్దీకి తగ్గట్టుగానే ఆపదమొక్కుల వాడి ఆదాయం అంతకంతకు పెరుగుతోంది. భక్తులు హుండీలో సమర్పించే కానుకలు, విరాళాలు వెంకన్నకు కొండంత ఆస్తిగా మారుతున్నాయి. సామాన్యుడి నుంచి సంపన్నుడు దాకా తమకు తోచినంత ముడుపులు కట్టి వెంకన్న హుండీలో సమర్పిస్తున్నారు. భక్తులు భక్తితో సమర్పించిన హుండీ కానుకలు రికార్డులను బద్దలు కొడుతున్నాయి.

తిరుమల శ్రీనివాసుడి దివ్యమంగళ రూపాన్ని క్షణకాలంపాటు దర్శించుకోగానే తమ జీవితం ధన్యమయిందని భావిస్తారు. ముడుపులు కట్టి తెచ్చిన కానుకలను ఎంతో భక్తితో హుండీలో సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు భక్తులు. నిత్యం వేలాదిగా తరలివస్తున్న భక్తులు వెలకట్టలేని కానుకలను సమర్పిస్తున్నారు. దీంతో తిరుమల శ్రీవారికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం నమోదు అవుతోంది.

తాజాగా మరోసారి హుండీ ఆదాయం ఒక్కరోజే రూ. 5 కోట్లు దాటింది. జూలై 28 సోమవారం 77,044 మంది భక్తులు దర్శించుకోగా, వారు సమర్పించిన హుండీ ఆదాయం రూ. 5.44 కోట్లు, అలాగే మంగళవారం 75183 మంది భక్తులు దర్శించుకోగా వారు సమర్పించిన ఉండి ఆదాయం రూ 4.89 కోట్లు వచ్చినట్లు టీటీడీ వెల్లడించింది. ఈ నెలలో (జూలై 2025) తొలిసారిగా ఒక రోజుకు రూ. 5.44 కోట్ల హుండీ ఆదాయం రావడం విశేషం. ఇప్పటివరకు ఈ ఏడాదిలో (2025) నాలుగుసార్లు ఒక రోజులో రూ. 5 కోట్లకు పైగా హుండీ కానుకల ద్వారా ఆదాయం టీటీడీకి లభించింది. ఏప్రిల్ 1, మే 26, జూన్ 30, జూలై 28 తేదీల్లో ఈ మార్కును దాటింది. గతంలో కూడా తిరుమల హుండీ ఆదాయం రూ. 5 కోట్లకు పైగా వచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి. 2022 ఏప్రిల్ 1న రూ. 5.73 కోట్లు, 2022 జూలై 4న అత్యధికంగా రూ. 6.18 కోట్లు వచ్చింది. ఇక 2023 ఆగస్టు 14న రూ. 5.67 కోట్లు రాగా. 2025 జూలై 1న రూ. 5.30 కోట్ల మేర వచ్చింది. మొత్తంగా తిరుమలలో భక్తుల రద్దీ పెరిగినప్పుడు, హుండీ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. సహజంగా వీకెండ్స్, వరుస సెలవుల రోజులలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే గత మూడు నెలలుగా ఎలాంటి సెలవులు లేని సాధారణ రోజుల్లో కూడా సుమారు 70 వేలకు పైగా భక్తులు దర్శించుకుంటున్నారు.

తిరుమలలో గత ఏడు నెలల కాలంలో జనవరి నుండి జూలై వరకు శ్రీవారిని సుమారు 1 కోటి 52 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. ఇదే సమయంలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది భక్తుల సంఖ్య బాగా పెరిగింది. అయితే హుండీ ఆదాయం మాత్రం స్వల్పంగా పెరిగింది. ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో సుమారు రూ. 780 కోట్ల మేర హుండీ ఆదాయం వచ్చింది. భక్తుల రద్దీలో పెరుగుదల కనిపించినప్పటికీ, హుండీ కానుకల విషయంలో అంత స్థాయిలో ఆదాయం పెరగలేదని తెలుస్తోంది. గడిచిన ఏడు నెలల కాలంలో సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం, ఇతర సేవల ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. నూతన క్యూలైన్ విధానం ద్వారా ఎక్కువ సంఖ్యలో భక్తులకు దర్శనం కల్పించాలని అధికారులు కృషి చేస్తున్నారు.

# యువతకు నైపుణ్య శిక్షణ

- **తిరుపతి జిల్లాలో ఇండస్ట్రీ 4.0 అమలుపై స్పష్టత**
- **పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి ప్రశ్నకు కేంద్రం సమాధానం**



**తిరుపతి, జూలై 30 మనం న్యూస్ :** ఆధునిక సాంకేతిక రంగాల్లో యువతకు నైపుణ్య శిక్షణ కోసం కేంద్ర బడ్జెట్లో ప్రవేశ పెట్టిన ఇండస్ట్రీ 4.0 అమలు కోసం తీసుకుంటున్న చర్యలపై తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి బుధవారం లోక్సభలో వివరాలు కోరారు. ఆంధ్రప్రదేశ్లో, ముఖ్యంగా తిరుపతి జిల్లాలో ఇండస్ట్రీ 4.0 ఆధారిత శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయా, ఐజర్, ఎస్వీ యూనివర్సిటీ, లేదా ఇతర నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు ఈ రంగాల్లో శిక్షణ అందించేందుకు ఎంపికయ్యాయా, తిరుపతి వంటి జిల్లాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ పరిశ్రమకు మద్దతు, ప్రోత్సాహకాలు ఇచ్చారా, ఇండస్ట్రీ 4.0, డిజిటల్ తయారీ వంటి జాతీయ కార్యక్రమాల ద్వారా తిరుపతి యువతకు ప్రత్యక్ష లాభాలు వచ్చేలా కేంద్రం ఎటువంటి ప్రణాళికలు రూపొందించిందో వివరాలు కావాలని కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ ప్రోగ్రామ్ కింద 2.79 లక్షలకు పైగా అభ్యర్థులను చేర్చుకుందని, ఈ కార్యక్రమం నాస్కామ్ తో సహకారంతో నడుస్తోందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్, త్రీడి ప్రింటింగ్, సైబర్ సెక్యూరిటీ మొదలైన అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో అభ్యర్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం దీని లక్ష్యం పేర్కొన్నారు. ఇటీవల తిరుపతిలో ఎంపి గురుమూర్తి కృషితో ఏర్పాటు చేయబడిన నైలెట్ కేంద్రాన్ని స్థాపించిన విషయం అందరికి విదితమే, ప్రస్తుతం తిరుపతి నైలెట్ కేంద్రంలో పైన పేర్కొన్న కోర్సులే కాకుండా పైథాన్ ప్రోగ్రామింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్ మరియు డ్రోన్ టెక్నాలజీ వంటి కార్యక్రమాలను అందిస్తోందని తెలియజేసారు. తిరుపతిలోని సాఫ్ట్వేర్ టెక్నాలజీ కేంద్రంలో స్థానిక ఐటి పరిశ్రమ, స్టార్టప్లు, వాటి వ్యవస్థాపకులకు ఇంక్యుబేషన్ సేవలతోపాటు పలు సేవలను అందిస్తోందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో నాలుగు ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు ఏర్పాటు చేసిందని ఇందులో తిరుపతి జిల్లా సత్యవేడు మండలం, చెరివి గ్రామంలో, ఏర్పేడు మండలం, వికృతమాల గ్రామం, రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలోని తిరుపతి విమానాశ్రయం సమీపంలో, వైఎస్సార్ కడప జిల్లా, కొప్పర్తిలో సుమారు 62 కంపెనీలు రూ. 6,421 కోట్లతో 59,694 మందికి అదనపు ఉపాధి కల్పించే అవకాశం ఉందని తెలియజేసారు. ప్రభుత్వం 2021లో విశాఖపట్నంలో ఇండస్ట్రీ 4.0పై కల్పతరు సెంటర్ ఆఫ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ ని స్థాపించింది. ఇప్పటివరకు, కల్పతరు 45 స్టార్టప్లకు మద్దతు ఇచ్చిందని తెలియజేసారు.

# శ్రీవాణి టికెట్లు జారీ విధానంలో మార్పు

- **1 నుంచి నూతన విధానం ప్రయోగాత్మకంగా అమలు**



**తిరుమల, జూలై 30, మనం న్యూస్ :** శ్రీవాణి దర్శన టికెట్లు ఆఫ్ లైన్ లో పొంది శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తుల సౌకర్యార్థం వారి దర్శన సమయాల్లో మార్పులు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలోని గోకులం సమావేశ మందిరంలో ఆయన శ్రీవాణి దర్శనాలపై బుధవారం నాడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత విధానం వలన సదరు శ్రీవాణి టికెట్ దర్శనం కోసం భక్తులకు సుమారుగా మూడు రోజుల సమయం పట్టేది. వారి సౌకర్యార్థమై ఏ రోజు కా రోజు టికెట్ జారీ మరియు దర్శనం కల్పించడం గురించి ప్రయోగాత్మకంగా ఆగస్టు 01 తారీఖు నుండి 15వ తారీఖు వరకు టీటీడీ అమలు చేయనుంది. తిరుమలలో ఉదయం 10 గంటల నుండి మొదట వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన టికెట్ల జారీ. టికెట్లను పొందిన శ్రీవాణి భక్తులకు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు రిపోర్టింగ్ సమయం. రేణిగుంట విమానాశ్రయంలో ఉదయం 7 గంటల నుండి దర్శన టికెట్లు కోటా ఉన్నంతవరకు జారీ. యథావిధిగా తిరుమలలో ఆఫ్ లైన్ ద్వారా 800 టికెట్లు, రేణిగుంట విమానాశ్రయంలో 200 టికెట్లు జారీ. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ద్వారా అక్టోబర్ 31వ తేది వరకు ఆన్ లైన్లో శ్రీవాణి టికెట్లను పొందిన భక్తులకు యథావిధిగా ఉదయం 10 గంటలకే దర్శనానికి అనుమతి. నవంబర్ 1వ తేది నుండి శ్రీవాణి టికెట్లను ఆఫ్ లైన్ మరియు ఆన్ లైన్ టికెట్లు పొందిన భక్తులు సాయంత్రం 4:30 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1 ద్వారా శ్రీవారి దర్శనానికి అనుమతి. భక్తులు ముందుగా కౌంటర్ల వద్దకు చేరుకుని తాము ఇబ్బంది పడకుండా ఉదయం 10 గంటలకు మాత్రమే తిరుమలలోని శ్రీవాణి టికెట్ జారీ చేయు ప్రదేశం వద్దకు చేరుకోవాలని మనవి. ఈ నూతన విధానం తో భక్తులు శీఘ్రంగా అనగా వచ్చిన రోజునే దర్శనం చేసుకునే వెసులుబాటుని గ్రహించ గలరు.ఈ సమావేశంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోలు లోకనాథం, వెంకటయ్య, ట్రాన్స్ పోర్ట్ మరియు ఐటీ జీఎం శేషారెడ్డి, వీజీవోలు రామ్ కుమార్,సురేంద్ర, ఐటి డిప్యూటీ జి ఎం వెంకటేశ్వర్లు నాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కరేడు భూసేకరణ ఎవరి కోసం?

- **పెట్టుబడిదారుల బాగే కానీ ప్రజల బాగు పట్టదా?**
- **ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు జె. పూర్ణచంద్ర రావు**

**తిరుపతి/విజయవాడ, జూలై 30 మనం న్యూస్ :** నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో జరుగుతున్న అణచివేత దారుణమని, అక్కడి ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములు లాక్కోవడం దుర్మార్గమని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు, విశ్రాంత డీజీపీ జె. పూర్ణచంద్ర రావు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ మొగల్రాజపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడు, బీసీ నాయకుడైన బోడె రామచంద్ర యాదవ్ను సమస్యాత్మక గ్రామమైన కరేడు వెళ్లకుండా ఆపేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కరేడు గ్రామంలో జరుగుతున్న అవినీతి అంతా ఇంతా కాదని ఆక్షేపించారు. గత వైయస్సార్సీపీ ప్రభుత్వంలో, వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విశ్వేశ్వర్ రెడ్డి అనే వ్యక్తికి చెందిన సంస్థకు 8 వేల ఎకరాలు కట్టబెట్టారని గుర్తు చేశారు. ఆ సమయంలో ప్రస్తుత మంత్రి అయిన నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తూ రైతుల వినతులు స్వీకరించి, కేటాయింపు రద్దు చేస్తానని హామీ ఇచ్చారని పూర్ణచంద్ర రావు వివరించారు. కరేడు గ్రామంలో ఎక్కువ శాతం మంది యానాదులు, బెస్తవాళ్లు, యాదవులు, రెడ్లేనని, వెనుకబడిన వారి నుంచి భూములు సేకరించడం తగదని సూచించారు. ఇక్కడ దాదాపుగా 8 వేల ఎకరాల భూమిని సోలార్ ఇండస్ట్రీ కోసం జగన్ ఇస్తే, దాన్ని వ్యతిరేకిస్తూ లోకేష్ పాదయాత్రలో మాట్లాడారని గుర్తు చేశారు. ఇప్పటి ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత సైతం ఆనాడు పవన్ కల్యాణ్ వ్యతిరేకించారన్నారు. అంతేకాదు ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు కూడా గతంలో వ్యతిరేకించారనేది మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీలు కూడా పెట్టుబడిదారీవర్గాలకు కొమ్ముకాసే పార్టీలని దుయ్యబట్టారు. పెట్టుబడులు పెట్టేవారి కోసం పని చేసే పార్టీలు కాబట్టి, తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాగానే, అదే విశ్వేశ్వర్ రెడ్డికి తిరిగి 8 వేల ఎకరాలు కట్టబెట్టడంలో నిమగ్నమయ్యారని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు ఆరోపించారు. అందుకు కారణం ఈ విశ్వేశ్వర్ రెడ్డి తెలుగుదేశం పార్టీకి రూ. 40 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చారని తీవ్ర ఆరోపణ చేశారు. ఆ కృతజ్ఞతాభావంతోనే కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. కరేడులో యానాదులను నేడు తీవ్రంగా హింసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ గిరిజన మహిళను అరెస్ట్ చేసినందుకు నిరసనగా బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ ఆ గ్రామానికి వెళ్లడానికి ప్రయత్నిస్తే, నెల్లూరు జిల్లా వెంకటాచలం దగ్గర అరెస్ట్ చేసి వెళ్లకుండా చేశారని, అక్కడి నుంచి పుంగనూరు తరలించారని పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థను ఎంత దుర్వినియోగం చేస్తున్నారో ఈ చర్యతో ప్రజలందరికీ అర్థమవుతుందన్నారు. బీసీవై అధ్యక్షుడు కరేడు వెళ్తే ప్రభుత్వానికి ఎందుకు అభ్యంతరమని, ఆయన వెళ్లడం వల్ల శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందా లేక గొడవలేమైనా జరుగుతాయా లేక వ్యతిరేకించే వారెవరైనా ఆ గ్రామంలో ఉన్నారా అని నిలదీశారు. ఆ గ్రామంలో అందరూ బాధితులేనని, ఈ భూకేటాయింపును ఆ గ్రామంలోని రెడ్లు కూడా వ్యతిరేకిస్తున్నారని పూర్ణచంద్ర రావు వివరించారు. అయినప్పటికీ ఈ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలనకు పూనుకుంటూ పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. విశ్వేశ్వర్ రెడ్డికి రెండు ప్రభుత్వాలు భూపందేరం చేసిన ఉదంతంతో ప్రజావ్యతిరేక పాలన అని రుజువవుతోందని స్పష్టం చేశారు. పీ4 అని చెబుతున్న ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను కొన్ని కుటుంబాలను దత్తత తీసుకుని బాగు చేయాలని చెబుతున్నారని, కానీ విశ్వేశ్వర్ రెడ్డి దాదాపు 1500 కుటుంబాలను వీధిపాలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఇదే పారిశ్రామికవేత్తలు పది కుటుంబాలను దత్తత తీసుకోమనడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. ఉన్న ఇళ్ల నుంచి వెళ్లగొట్టి, వీళ్లు బాగు చేసేది ఏంటని నిలదీశారు. అమరావతిలో సైతం జరుగుతున్నది ఇదేనన్నారు. 40 వేల ఎకరాలు ఇప్పటికే సేకరించి, మళ్లీ 45 వేల ఎకరాలు సేకరిస్తామనడంలో అర్థం ఏంటని అడిగారు. ఉన్న భూములకే దిక్కు లేనప్పుడు, మళ్లీ భూసేకరణ అనడమేంటని, 5 వేల ఎకరాల్లో విమానాశ్రయం ఎందుకని, 1500 ఎకరాల్లో రైల్వే స్టేషన్ అవసరమా అని ప్రశ్నలు సంధించారు. ఈ ప్రభుత్వాలు పెట్టుబడిదారీవర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నవే కానీ, ప్రజల కోసం కాదన్నారు. నేడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఏ ప్రభుత్వం వచ్చినా న్యాయం జరగడం లేదని, అన్యాయమే జరుగుతోందని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు, విశ్రాంత డీజీపీ జె. పూర్ణచంద్ర రావు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో భారత చైతన్య యువజన పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఆగస్టు 16న తిరుచానూరు శ్రీకృష్ణస్వామి ఆలయంలో గోకులాష్టమి

## పెద్దశేష వాహనంపై శ్రీకృష్ణస్వామి కటాక్షం




**తిరుచానూరు, జూలై 30 మనం న్యూస్ :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామి ఆలయంలో ఆగస్టు 16వ తేదీన గోకులాష్టమి పర్వదినాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. గోకులాష్టమి రోజున ఉదయం శ్రీకృష్ణస్వామి మూలవర్లకు అభిషేకం, అర్చన నిర్వహిస్తారు. శ్రీ కృష్ణస్వామి ముఖ మండపంలో మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4 గంటల వరకు శ్రీ కృష్ణ స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం స్వామివారికి ఊంజల్సేవ జరుగనుంది. రాత్రి 7 నుండి 8.15 గంటల వరకు స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి కటాక్షించనున్నారు. అనంతరం రాత్రి 8.30 నుండి 9 గంటల వరకు గోపూజ, గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. అదేవిధంగా ఆగస్టు 17న ఉట్లోత్సవంను పురస్కరించుకొని మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, తరువాత ఊంజల్సేవ జరుగనుంది. సాయంత్రం 6.15 నుండి రాత్రి 7.30 గంటల వరకు స్వామివారికి ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. ఈ కారణంగా ఆగస్టు 16న ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవను టీటీడీ రద్దు చేసింది.

# గృహ నిర్మాణ రంగంలో పురోగతి

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూలై 30 మనం న్యూస్ :** గృహ నిర్మాణ రంగంలో పురోగతి సాధించాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, పూతలపట్టు, జీడి నెల్లూరు, చిత్తూరు అర్బన్, నియోజకవర్గాల ఎన్టీఆర్ గృహ నిర్మాణాల పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఇంచార్జ్ సుబ్రహ్మణ్యం, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రణాళికలో పేర్కొన్న లక్ష్యాలను సాధించడంలో అధికారులు నిబద్ధతతో కృషి చేయాలని తెలిపారు. నియోజకవర్గాలలో క్షేత్రస్థాయిలో హౌసింగ్



డిఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గృహ నిర్మాణ అధికారులు క్రమం తప్పకుండా స్థల సందర్శనలు నిర్వహించి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయడానికి అదనపు ప్రయత్నాలు చేయాలని ఆదేశించారు. జిల్లా అంతటా మొత్తం 73,098 ఇళ్లు మంజూరు చేయడం జరిగింది, వీటిలో 52 880 ఇల్లు పూర్తి చేయడం జరిగింది, 20,218 22,756 ఇళ్ల నిర్మాణం పనులు పూర్తి కావలసి ఉన్నది, మిగిలిన ఇళ్లు త్వరితగతిన పూర్తి కావలసి ఉన్నది సంబంధిత అధికారులు లబ్ధిదారులతో చర్చించి వారి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంలో ఏవైనా సందేహాలు ఉంటే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు నిర్మాణం జరుగుతున్న నివాస ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడానికి ఇతరవిభాగాలలోనివారిసహచరులతో కలిసి పనిచేయాలని కలెక్టర్ గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. రేపటి రోజున కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో, హౌసింగ్ అధికారులతో, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల హౌసింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్.బి.ఏ అక్రిడిటేషన్

**తిరుపతి, జూలై 30 మనం న్యూస్ :** టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న శ్రీ పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు 2028వ సంవత్సరం వరకు నేషనల్ బోర్డు అక్రెడిటేషన్ (ఎన్.బి.ఏ) మంజూరు చేసింది. ఈ సందర్భంగా టిటిడి ఈవో శ్రీ జె.శ్యామలరావు మాట్లాడుతూ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. పద్మావతమ్మ, అధ్యాపకులు, సిబ్బంది సమిష్టి కృషితో పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ అక్రెడిటేషన్ మంజూరు అయ్యేలా పనిచేశారని అభినందించారు.

ఇదే స్ఫూర్తితో మరింతగా కష్టించి జాతీయ స్థాయిలో కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని, మరింత నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. శ్రీ పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్.బి.ఏ గడవు ముగియడంతో ఎన్.బి.ఏ ప్రతినిధులు గత నెలలో కళాశాలలో ఇన్ స్పెక్షన్ నిర్వహించి 2028 వరకు అక్రెడిటేషన్ ఇచ్చారు.గత నెలలో న్యూఢిల్లీ నుండి విచ్చేసిన ఎన్.బి.ఏ నిపుణుల బృందం కళాశాలలోని ప్రయోగశాలలు, అధ్యాపకులు, సిబ్బంది వివరాలు, రికార్డులు, మౌళిక సదుపాయాలను పరిశీలించారు. కళాశాలలో బోధన, ల్యాబ్స్, లైబ్రరీ, బోధన తదితర అంశాలపై విద్యార్థుల నుండి ఫీడ్ బ్యాక్ సేకరించారు. నేషనల్ బోర్డ్ నిబంధనల మేరకు పాలిటెక్నిక్ కళాశాలను నిర్వహిస్తుండడంతో ఎన్.బి.ఏ మంజూరు అయింది. ఈ ఎన్.బి.ఏ అక్రిడిటేషన్కు సహకరించిన టిటిడి ఈవో జె శ్యామలరావు, జెఈవో వీరబ్రహ్మం, డిఈవో వేంకట సునీల్, కళాశాల బృందానికి ప్రిన్సిపాల్ డా.ఎం. పద్మావతమ్మ ధన్యవాదాలు తెలియజేశారు.



# ఘాట్ రోడ్ వాహనాలపై నిర్దిష్టమైన పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయాలి

## అధికారులకు టీటీడీ అదనపు ఈవో ఆదేశం

**తిరుపతి, జూలై 30 మనం న్యూస్ :** తిరుమలలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రాకపోకలను, తద్వారా ఏర్పడుతున్న వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ఘాట్ రోడ్లలో వాహనాలు మరియు తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణపై పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్. వెంకయ్య చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం తిరుమల గోకులం సమావేశ మందిరంలో టీటీడీ ట్రాన్స్పోర్ట్, అటవీ, విజిలెన్స్, ఆర్టీఏ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుమలలో ట్రాఫిక్ను నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ పాలసీ డాక్యుమెంట్ లో ఈవీ పాలసీ, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ను బలోపేతం చేయడం, ప్రైవేట్ జీప్ డ్రైవర్లకు అవగాహన కల్పించడం, పాత వాహనాల వల్ల ఏర్పడుతున్న పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడం వంటి అంశాలు చేర్చాలని సూచించారు. అలాగే తిరుమలలో ప్రీపెయిడ్ టాక్సీ సదుపాయం ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పార్కింగ్ స్థలం గుర్తించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం కనీస, గరిష్ట ఛార్జీలను నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ట్రాన్స్పోర్ట్ జీఎం శేషా రెడ్డి, టీటీడీ డిప్యూటీ సిఎఫ్ ఫణికుమార్ నాయుడు, విజిలెన్స్ అధికారులు రామ్కుమార్, సురేంద్ర, జిల్లా రవాణా అధికారి కె. మురళి మోహన్తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## మనుషులపేర్లు కూడా మారుస్తారా?

పెంటల పేర్లు..ఉట్టిగనే రాలే
కార్లలో రాలే ఆకాశం నుండి ఊడిపడలే
పెంట పెంటకో బతుకు కథ
ఊరూరుకో త్యాగాల చరిత
ప్రతి ఆకు పెంటనే
ప్రతి చెట్టు పుట్ట పెంటనే
పెంటల పేర్ల మార్పు
సామాజిక మార్పు కాదు
అస్తిత్వ విధ్వంసం
చెంచుల అస్తిత్వాలే పెంటలు
మోతుకాకుల్లా మనుషులు
గడ్డిపూల మనుసులు
మోదుగుపూల మానవతలు
వెదురుపూలలా నవ్వే ఆదివాసీలు
పెంటలు పుట్టినప్పటినుండే
వాడుకలో ఉన్నాయి
పెంటలంటే మట్టిపేటలు
మానవ నాగరికతకు ఆనవాళ్లు
పక్షుల గూళ్లలా పెంటలు
ద్రావిడ నాగరికతకు చిహ్నాలు
శ్రీశైలానికీ ఉత్తరద్వారాలు
ఈగలపెంట దోమలపెంట సున్నిపెంటలు
ప్రతి మనిషి పేరు పెంటమ్మ పెంటయ్యనే!
ఊగుడమ్మ ఊగుడయ్య
జోగమ్మ జోగయ్య పెర్లు అవమాన నామాలుకాదు
అమ్మయ్యలు పెట్టిన పేర్లు ఆత్మగౌరవానికీ
ఆనవాళ్లు..ప్రతి ఆకు పెంటనే
ప్రతి చెట్టు పెంటనే...ప్రతి చెలిమె కుంటనే
పుల్లయ్య పెంట లింగమ్మ పెంట
బౌరాపూర్ పెంట రాంపూర్ పెంట
అప్పాపూర్ పెంట
కురువమీది పెంటలు కురువకింది పెంటలు
పశువుల ఆవాసాలు..పేడల నివాసాలు
పెంటలే పేటలు
దుర్భర జీవితాలను మార్చలే గానీ
పెంటల పేర్లు మార్చుతున్నారు
బతుకుల్లో గోగుపూలు పూయాలి
కృష్ణగిరి బ్రహ్మగిరి నామాలు
వెయ్యేళ్లకు ముందులేవు
తరువాతలేవని చరిత్ర ఘోషిస్తున్నా....
పదవులలో పేర్లకోసం అస్తిత్వ హననానికి తెరలు
పెంటలపేర్లు మార్చినట్లుగా
మనుషులపేర్లు కూడా మారుస్తారా?
*(నాగర్ కర్నూలు జిల్లా నల్లమలలో ఈగలపెంట దోమల పెంటల పేర్లను మార్చడాన్ని నిరసిస్తూ..)*

**- వనపట్ల సుబ్బయ్య**
9492765358

# చదరంగంలో సునామీ దివ్య దేశ్‌ముఖ్



దివ్య దేశ్‌ముఖ్ ప్రస్తుతం పంతొమ్మిది ఏళ్ల యువతి భారత చదరంగంలో ఒక సంచలనం మాత్రమే కాదు! కోట్లాదిమంది యువతకు ఒక జీవన స్ఫూర్తి. ఆమె ఆటతీరు, మొక్కవోని ఆత్మ విశ్వాసం, అత్యంత ఒత్తిడిలోనూ ప్రద ర్శించే అసాధారణమైన ప్రశాంతత అందరినీ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. 2025 జూలై 28న జార్జియాలోని జరిగిన ఫిడే మహిళల ప్రపంచ కప్ 2025 ను గెలుచుకోవడం ద్వారా దివ్య చరిత్రను తిరగరాసింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఫైనల్లో భారత చెస్ దిగ్గజం కోనేరు హంపిని ఓడించి 'ఫిడే' మహిళల ప్రపంచ కప్పును గెలిచిన మొట్టమొదటి భారతీయ మహిళగా రికార్డు సృష్టించింది. ఈ అద్భుతమైన విజయంతో పాటు ఆమెకు గ్రాండ్‌మాస్టర్ బిరుదు కూడా లభించింది. దీనితో ఆమె గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను సాధించిన నాల్గవ భారతీయ మహిళగా 88వ భారతీయ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచింది. ఈ విజయంతో ఆమె ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్ 2026కి అర్హత సాధించింది. ఆమె వరల్ రాపిడ్, బ్లిట్జ్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లలో అగ్ర స్థానంలో ఉన్న హౌయిఫాన్‌ను కూడా ఓడించింది. ఈ విజయం దివ్య ధైర్యానికి ఆమెలో ఉన్న అంతులేని ఆత్మవిశ్వాసానికి, అసాధారణమైన సంకల్పానికి నిదర్శనం. యువత పట్టుదల, కష్టపడే తత్వం ఎంత శక్తివంతమైనదో కలలను ఎలా నిజం చేసుకోవాలో దివ్య తన ప్రయాణం ద్వారా స్పష్టంగా నిరూపిస్తోంది.

**బాల్యం నుండి ఆట పట్ల పట్టుదల**

దివ్య దేశ్‌ముఖ్ 2005 డిసెంబర్ 9న మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోజన్మించింది. ఆమె ప్రయాణం కేవలం ఒక చదరంగ క్రీడాకారిణిది మాత్రమే కాదు, ఒక సాధారణ బాలిక అసాధారణ లక్ష్యాలను ఎలా చేరుకుందో చెప్పే కథ. చాలా చిన్న వయసులోనే ఆటలు, పాటలపై ఆసక్తి చూపే వయసులో దివ్య చదరంగం ఎత్తుగడలను నేర్చుకోవడం ప్రారంభించింది. అది కేవలం ఒక ఆటగా కాకుండా, ఆమె జీవితాన్ని మలుపు తిప్పే మార్గంగా మారింది. ఆట నేర్చుకోవడం మొదలుపెట్టిన కొద్ది కాలంలోనే ఆమె అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించడం మొదలుపెట్టింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో తనదైన ముద్ర వేసింది. 2012లో, కేవలం ఏడేళ్ల వయసులో ఆమె అండర్-7 జాతీయ ఛాంపియన్‌గా నిలిచి, భవిష్యత్ విజయాలకు పటిష్టమైన పునాదులు వేసింది. ఆ తర్వాత 2014లో అండర్ -10 ప్రపంచ యూత్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించింది. ఈ విజయాలు ఆమె ప్రతిభకు, నిరంతర సాధనకు, అకుంఠిత దీక్షకు సజీవ నిదర్శనం. దివ్య ప్రయాణం అంచెలంచెలుగా సాగింది. ప్రతి అడుగు ఆమె కెరీర్‌లో ఒక మెట్టుగా నిలిచింది. 2013లో ఆమెకు ఉమెన్ ఫిడే మాస్టర్ బిరుదు లభించింది. ఆ తర్వాత 2021లో ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ బిరుదును సాధించి అంతర్జాతీయ స్థాయిలో ఒక గుర్తింపును తెచ్చుకుంది. 2023లో ఆమెకు ఇంటర్నేషనల్ మాస్టర్ బిరుదు లభించింది. 2024లో ఆమె వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌గా కూడా నిలిచింది. ఈ బిరుదులు ఆమె చదరంగంలో ఎంత వేగంగా ఎంత పటిష్టంగా ఎదిగిందో స్పష్టం చేస్తాయి. ప్రతి కదలికా, ప్రతి విజయం ఆమె లక్ష్యం పట్ల ఉన్న అంకితభావాన్ని, కష్టపడే తత్వాన్ని తెలియజేస్తాయి. ఒక బాలికగా ఒక క్రీడాకారిణిగా ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, ఆ ఒత్తిడిని అధిగమించిన తీరు ఆమె ప్రస్థానంలో ఎంతో కీలకమైనవి. పోటీ ప్రపంచంలో చిన్న వయసులోనే ఇంతటి శిఖరాలను అధిరోహించడం అనేది అసాధారణమైన సంకల్పానికి, నిరంతర అభ్యాసానికి, విజయం పట్ల ఉన్న అచంచలమైన విశ్వాసానికి నిదర్శనం.

**దూకుడుతో కూడిన తెలివైన ఎత్తుగడలు**

అచంచలమైన ఆత్మవిశ్వాసమే ఆమె విజయం రహస్యం. దివ్య దేశ్‌ముఖ్ ఆట తీరును 'అతిదూకుడు','వ్యూహాత్మకం' 'చమత్కారమైనది' అని దగ్గర నుండి చూసినవారు అంటారు. ఒత్తిడిలో ఆమె ప్రశాంతత క్రికెట్ లెజెండ్ ఎంఎస్ ధోనితో పోల్చడానికి దారి తీసింది. ఆమె ఎప్పుడూ దాడి చేయడానికి వెనుకాడదు. ఆటలో క్లిష్టమైన, ప్రమాదకరమైన పరిస్థితులను సృష్టించి ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడానికి ఇష్టపడుతుంది. ఆమె మాజీ కోచ్ ఆర్.బి. రమేష్ ఆమెకున్న అసాధారణమైన ఆత్మవిశ్వాసాన్ని, అలాగే క్లిష్టమైన వ్యూహాత్మక ఆట పరిస్థితుల పట్ల ఆమెకున్న అసాధారణమైన ఆసక్తిని తరచుగా ప్రశంసిస్తుంటారు. దివ్య ఎప్పుడూ సంక్లిష్టమైన పరిస్థితులకు భయపడదు. తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు కూడా, పట్టుదలతో పోరాడగల మానసిక బలం ఆమెకు ఉంది. కీలకమైన మ్యాచుల్లో ఆమె చూపిన ప్రశాంతత, ఏ మాత్రం తొట్రుపడకుండా ఆడే తీరు ఆమె ఆటతీరుకు నిదర్శనం. ఆమె అనేక సార్లు ఓటమి అంచున ఉన్నప్పుడు కూడా చివరి వరకు పోరాడి మ్యాచ్‌లనుటై-బ్రేక్‌లకు తీసుకెళ్లి విజయం సాధించిన సందర్భాలు అనేకం. ఫీడే మహిళల ప్రపంచ కప్ 2025 ఫైనల్లో కోనేరు హంపితో ఆమె తలపడినప్పుడు రెండు విభిన్న ఆట తీరులు కనిపించాయి.

హంపి స్థిరమైన, పొజిషనల్ విధానానికి వ్యతిరేకంగా దివ్య దూకుడు,వ్యూహాత్మక శైలి ఉంది. దివ్య తెలివి గా ఆటను తక్కువ సమయ నియంత్రణల వైపు మళ్ళించింది. అక్కడ ఆమె శక్తివంతమైన ఆట, వ్యూహాత్మక నైపుణ్యం మరింత ప్రభావవంతంగా ఉంటాయి. ఈ వ్యూహాత్మక ఆలోచన, ఆమె మొక్కవోని ఆత్మవిశ్వాసంతో కలిసి ఒక అనుభవజ్ఞుడైన దిగ్గజాన్ని ఓడించి అంతిమ బహుమతిని గెలుచుకోవడానికి సహాయపడింది.



ఆమె ఆటలో ఖచ్చితమైన లెక్కలు, భవిష్యత్ కదలికలను ఊహించడం, అత్యంత ఒత్తిడిలో కూడా సరైన నిర్ణయాలు తీసుకోవడం స్పష్టంగా కనిపిస్తుంది. ఇది కేవలం ఆమెకున్న సహజసిద్ధమైన ప్రతిభ మాత్రమే కాదు, గంటల తరబడి చేసిన సాధన, వేలాది మ్యాచ్‌లను విశ్లేషించడం, ఆటపై ఆమెకున్న లోతైన అవగాహనను కూడా సూచిస్తుంది.

గ్రాండ్‌మాస్టర్ అభిజిత్ కుంటే వంటి నిపుణులు దివ్యలో అరుదైన పరిపక్వతను గమనించారు. ఆమె అనుకూలమైన ప్రతికూల పరిస్థితులలో కూడా అద్భుతంగా రాణించగలదని పేర్కొన్నారు. ఆమె గెలిచిన ప్రతి మ్యాచ్ వేసిన ప్రతి ఎత్తుగడ ఆమెలోని అసాధారణమైన మేధస్సును, దృఢ సంకల్పాన్ని చాటి చెబుతాయి.

**ఆమె నవతరం స్ఫూర్తి ప్రదాత**

భవిష్యత్ ఆశాకిరణంగా ఒక అద్భుతమైన సందేశం ఆమె విజయం. దివ్య దేశ్‌ముఖ్ కథ కేవలం చదరంగంలో ఆమె సాధించిన విజయాలకే పరిమితం కాదు! ఆమె ఒక శక్తివంతమైన సందేశాన్ని అందిస్తుంది. ఆమె యువత, అసాధారణ విజయాలు ఆమెను శక్తివంతమైన ఆదర్శంగా నిలబెట్టాయి. వయసు విజయానికి అడ్డంకి కాదని, అంకితభావం, భయం లేని దృక్పథంతో ఏదైనా సాధించవచ్చని ఆమె నిరూపించింది. భారత చదరంగంలో ముఖ్యంగా మహిళల చదరంగం లో ఆమె ఒక గొప్ప మార్గదర్శి. కోనేరు హంపి, హారిక ద్రోణవల్లి, వైశాలితో సహా గ్రాండ్‌మాస్టర్ బిరుదును సాధించిన నాల్గవ భారతీయ మహిళగా ఆమె నిలిచింది. ఇది భారత చదరంగ చరిత్రలో ఒక మైలురాయి. దివ్య యొక్క నిరంతర కృషి, అంకితభావం చదరంగంలోనే కాకుండా, జీవితంలో లక్ష్యాలను చేరుకోవాలను కునే ప్రతి యువతీ యువకుడికి ఒక మార్గదర్శిగా నిలుస్తుంది.

ఆమె ప్రపంచ కప్ విజయం ద్వారా నేరుగా గ్రాండ్‌మాస్టర్ బిరుదును పొందడం అనేది ఆమె అసాధారణ సామర్థ్యానికి, పట్టుదలకు నిదర్శనం. 'యువత నిజంగా ఏదైనా సాధించాలని అనుకుంటే, వయసు ఒక సంఖ్య మాత్రమే' అని దివ్య తన ఆట ద్వారా తన విజయాల ద్వారా నిరూపిస్తోంది. ఆమె ప్రయాణం అడ్డంకులను ఛేదించి, అసాధ్యమ నిపించే వాటిని సాధించగల స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుంది. ఆమె విజయాలు ఆశావహులైన క్రీడాకారులకు స్ఫూర్తినిస్తాయి. ఆమె ఆట శైలి మానసిక బలం ఆమెను భవిష్యత్తులో మహిళల ప్రపంచ ఛాంపియన్షిప్ టైటిళ్లకు బలమైన అభ్యర్థిగా చేస్తాయి. ప్రతికూల పరిస్థితులను అధిగమించి, తన కలలను నిజం చేసుకున్న దివ్య దేశ్ముఖ్ భవిష్యత్తులో భారత చదరంగానికి మరిన్ని గొప్ప విజయాలను అందిస్తుందని ఆశిద్దాం. ఆమె ప్రస్థానం ఇంకా ప్రారంభమే, ఆమె ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించనుంది. 'కలలు కనడం ప్రారంభం మాత్రమే, వాటిని నిజం చేసుకోవడం అద్భుతమైన ప్రయాణం' అని దివ్య విజయగాథ మనకు నేర్పుతుంది.


**- జనక మోహన రావు దుంగ**
8247045230

# లక్ష్యాన్ని ముద్దాడిన ఉద్ధంసింగ్

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన వారెందరో... అయితే అమర వీరుడు ఉద్దంసింగ్ ఆత్మార్పణం ఒక ప్రత్యేకం. కళ్ళముందే అనేకమంది ప్రాణా లను కిరాతకంగా తుపాకీ గుళ్ళకు బలి చేసిన శ్వేత జాతి అధికారిని హతమార్చి పగ తీర్చుకున్న సందర్భం. దేశ చరిత్రలో చెరిగిపోలేని దేశభక్తికి పరాకాష్టగా నిలిచిన ముఖ్యఘట్టం. జలియన్ వాలాబాగ్ మారణ కాండలో ప్రాణాలతో బయట పడిన యువకుడు తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చడానికి, పగ తీర్చకోవడానికి ఏళ్ళ తరబడి నిరీక్షించి, లక్ష్య సాధనలో దేశాన్ని వదిలి, శ్రమకోర్చి విదేశానికి వెళ్ళి, సమయం కోసం వేచి ఉండి, నర రూప రాక్షసుడైన డయ్యర్‌ను హతమార్చి, ఉరి తాడును ముద్దాడిన దేశం గర్వించదగ్గ అమరుడు ఉద్దమ్ సింగ్ సాహసోపేత నేపథ్యం అనన్య సామాన్యం, అపూర్వం, అసమానం. ఈ చారిత్రక నేపథ్యం గురించి తెలుసు కోవాలంటే వంద ఏళ్లు వెనకకు వెళ్లాల్సిందే.

పంజాబ్, బెంగాల్‌లో నానాటికీ పెచ్చరిల్లుతున్న విప్లవోద్యమం, భారత ప్రజల్లో నానాటికీ రగులు తున్న అసంతృప్తి (ముఖ్యంగా బాంబే మిల్ వర్కర్స్‌లో), మొదలైన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1918లో ఆంగ్లేయ న్యాయమూర్తి సిడ్నీ రౌలట్ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనినే రౌలట్ కమిటీ అంటారు. రౌలట్ కమిటీ ప్రతిపాదనను అనుసరించి బ్రిటీష్ ప్రభుత్వం 1915లో ఏర్పాటు చేయబడ్డ భారతీయ రక్షణ చట్టానికి అదనంగా రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించింది. ఈ చట్టం ద్వారా తిరుగుబాట్లను అణిచివేయడానికి వైస్రాయ్‌లకు విశేష అధికారాలని కట్టబెట్టారు. ప్రెస్ నోళ్ళను కట్టేయడానికీ, విచారణ లేకుండా రాజకీయ నాయకులను నిర్బంధించడం, తిరుగు బాటు దారునిగా అనుమానితులైన వ్యక్తులను వారంటు లేకుండా అరెస్టు చేయడం మొదలైన నిరంకుశమైన అధికారాలు ఇందులో ఉన్నాయి. ఈ చట్టంపై దేశంలో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్త మయ్యాయి. జలియన్ వాలాబాగ్ దురంతం భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో జరిగిన అత్యంత దురదృష్టమైన సంఘటన. 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్సర్ లోగల స్వర్ణ దేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ తోటలో దాదాపు 20 వేలమంది ప్రజలు సమావేశ మైనారు. అది వైశాఖ మాసం, సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవత్సరం. వారు అక్కడ సమావేశమవడానికి ముఖ్య కారణం, ప్రముఖ నేతలు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఉపన్యాసాలను వినడం, అనేక విమర్శలకు గురైన రౌలట్ చట్టం క్రింద సత్యపాల్,సైపుద్దీన్ కిచ్‌లను అక్రమంగా నిర్బంధించడాన్ని వ్యతిరేకించడం.

ఏప్రిల్ 13, 1919 న బ్రిటీష్ సైనికులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశమైన నిరాయుధులైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులు పది నిమిషాలపాటు కొనసాగాయి. ఇరుకైన సందుల కారణంగా వాహనాలు బాగ్ లోపలికి రాలేక పోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్ద భవనాలతోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలావాటికి తాళాలు వేసిఉన్నాయి. కాల్పుల కారణంగా వందల మంది మరణించారు. 1650 రౌండ్లు కాల్పులు జరిగాయి. అప్పటి ఆంగ్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 (337 పురుషులు, 41 మందిబాలురు, 6 వారాల పసికందు) మరణించారు. కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ 1000 కి పైగా మరణించారు. 2000 మందికి పైగా గాయపడ్డారు. అక్కడ స్మారక చిహ్నంపైన వ్రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను బయటకు తీశారు. నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు. పంజాబ్ అమృత్ సర్‌లోని 1919 ఏప్రిల్ 13న జలియన్‌వాలాబాగ్‌లో శాంతి యుతంగా వేల మంది సామాన్య పౌరులు సమావేశం అయి ఉండగా పోలీసులతో చుట్టు ముట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపి వేల మంది మరణానికి కారణం అయ్యాడు జనరల్ డైయర్.



షేర్ సింగ్ (ఉద్ధం సింగ్) 1899 డిసెంబర్ 26న పంజాబ్ లోని సంగ్ర జిల్లా సునం అనే గ్రామంలో కాంబోజి సిక్ కుటుంబంలో జన్మించాడు. తండ్రి తెహల్ సింగ్ పొరుగు గ్రామమైన ఉపాల్‌లో జమ్ము రైల్వే క్రాసింగ్ కాపలా దారుగా జీవనం సాగించేవారు. ఉద్ధంసింగ్ తల్లి దండ్రులు చనిపోయారు. ఉద్ధంసింగ్ వారి తల్లి తండ్రులు చనిపోయాక అన్న ముక్తా సింగ్‌తో కలిసి అమృత్‌సర్ లో సెంట్రల్ ఖల్సా అనాథ ఆశ్రమంలో చేరారు. అక్కడ సిక్కులకి మతపరమైన దీక్ష చేసి అక్కడ వారి చేత ఉద్ధంసింగ్ అనే పేరుని స్వీకరించాడు. మెట్రిక్యు లేషన్ చదువు 1918లో పూర్తి చేసి 1919లో ఆ అనాథ ఆశ్రమం నుండి బయటకి వచ్చాడు. జలియన్ వాలా బాగ్ సంఘటనలో యువకుడు ఉద్ధంసింగ్ కూడా ఉన్నాడు.

అమానుష దాడి తన కళ్ళ ముందే జరగడం హత్యాకాండకు సూత్రధారి అయిన డైయర్‌ను జెనరల్ మైకెల్ ఓడ్ వాయర్‌ను హతమార్చడానికి ప్రతీకారాన్ని తీర్చు కోవటానికి ప్రతినబూనాడు. భగత్‌సింగ్ విప్లవ భావాలకి ఆకర్షితుడై 1927న భగత్ సింగ్ ఆదేశాల మేరకు విదేశాల నుండి తుపాకులు తెస్తూపోలీసులకు దొరికి 1931 వరకు జైలు జీవితం గడిపాడు. విప్లవ వీరుడు భగత్ సింగ్‌ను ఉరి తీయడం సింగ్‌ను కలచివేసింది. జైలు నుండి విడుదల అయిన తరువాత చదువు పేరుతో పేరు మార్చుకుని పోలీసుల నిఘా నుండి తప్పించు కుని కాశ్మీర్, జర్మనీ మీదగా లండన్ చేరాడు. డైయ్యర్‌ని హత్య చేయడానికి పగబట్టి 9 సంవత్సరాలు ఎదురు చూసి 21 సంవత్సరాల తరువాత 1940 మార్చి 13న లండన్ కాక్స్ టన్ హాల్‌లో డయర్‌ని అందరు చూస్తుండ గానే తుపాకీతో కాల్చి ప్రతీకారం తీర్చుకుని పోలీసులకి స్వచ్ఛందంగా పట్టుబడి, తను చంపిన కారణాన్ని నిర్భయంగా చెప్పాడు. దీంతో జూన్ 4, 1940 ఓల్ బెయిలీలోని సెంట్రల్ క్రిమినల్ కోర్టులో, జస్టిస్ అట్కిన్సన్ మరణ శిక్ష విధించాడు. జూలై 31, 1940న, ఉద్ధంసింగ్ ను లండన్ పెంటన్ విల్లే జైలులో ఉరి తీసారు.

**జూలై 31...ఉద్ధంసింగ్ బలిదాన దినం**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494



## బోనం ఎత్తిన తెలంగాణ

మహానగరంలో మహంకాళికి బోనాలు
భాగ్యనగరంలో బల్కంపేట బోనాలు
బోనమెత్తిన భాగ్యనగరం
ఆషాడంలో హైదరాబాదులో బోనాలు
డప్పులతోదరువుతో దండిగా పూజలు!!
సికింద్రాబాద్‌లో శివసత్తులఆట పాటలు
పసుపు కుంకుమతో తల్లి కి పూజలు
గ్రామ గ్రామాన ఘనంగా బోనాలు
సాక పెట్టి సంతోషంగా ఉండాలని
కోరే భక్తులు
బైండ్లల్లో ఆటపాటలు!!
తల్లికి పల్లె పల్లెనా పట్నాలు
సబ్బండ వర్గాలు జరుపుకునే పండుగ
పోతరాజుల కొరడాలు
తీన్మార్ దరువుల గానాలు
మహంకాళి బోనాలు!!

**- దేవులపల్లి రమేశ్**
9963701294

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

## నా అక్షరాలకు రక్షణగా...!

కలం నా బలం...
అక్షరాలు నాకు ఆయువు!
నాలోని భావాలు...
కడలి కెరటాలు!

కవిత్వమే నాకు తోడు...
కడదాకా కలిసి వస్తూ!
పుస్తకాలు నా ప్రాణం
భౌతికంగా నేను లేని రోజు
నా ఊసులతో కాలం పయనిస్తుంది
బాధ్యతగా నన్ను మోయిస్తుంది!

దేహం తరలిపోయినా
మీ మధ్యే నా జ్ఞాపకాలు
తడి తడిగా తారసపడుతుంటాయి!
నా అక్షరాలకు రక్షణగా
వారసత్వమే నా భాండాగారం
మరణానంతరం జీవించడం ఒక వరం

**- పద్మజా రామకృష్ణ.పి**
9491830278

# ప్రజాదరణలో మోదీది అగ్రస్థానం



ప్రపంచ దేశాల్లో అత్యంత ప్రజాదరణ, ఆకర్షణీయ వ్యక్తిత్వం కలిగిన నాయకుడిగా మరోసారి భారత ప్రధాని నరేంద్ర మోదీ భారీ మెజారిటీతో ప్రథమ స్థానం ఆక్ర మించడం ప్రతి భారతీయుడికి గర్వకారణంగా నిలుస్తున్నది. తాజాగా 10 నుంచి 16 జూలై 2025 వరకు అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ సర్వే ప్రపంచ స్థాయిలో నిర్వ హించిన సర్వేలో అత్యంత ప్రజాదరణ కలిగిన ప్రజాస్వామ్య నాయకుల జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో ప్రపంచ ప్రజాస్వామ్య నాయకుల జాబితాలో 75 శాతం ప్రజల ఆమోదం పొంది నరేంద్ర మోదీ ప్రథమ స్థానంలో నిలిచారు. 2వ స్థానంలో 59 శాతం ప్రజల ఆమోదంతో దక్షిణ కొరియాకు చెందిన లీ జే-మ్యూంగ్ నిలిచారు. 3వ స్థానంలో 57 శాతం ఆమోదంతో అర్జంటీనాకు చెందిన గ్జావియర్ మిల్లే నిలిచారు. 4వ నాయకుడిగా 56 శాతం ఆమోదంతో కెనడాకు చెందిన మార్క్ కార్నీ నిలిచారు. 5వ స్థానంలో నిలిచిన ఆస్ట్రేలియాకు చెందిన ఆంథోనీ అల్బనీస్ నిలుస్తూ 54 శాతం ఆమోదంతో, 6వ స్థానంలో 53 శాతం ఆమోదంతో మెక్సికోకు చెందిన క్లాడియాశీన్బమ్ నిలిచారు. అదే విధంగా 7వ స్థానంలో 48 శాతం ఆమోదంతో స్విట్జర్లాండ్కు చెందిన కరిన్-కెల్లర్ సుట్టర్ నిలిచారు. 8వ స్థానంలో అమెరికాకు చెందిన డొనాల్డ్ ట్రంప్ 44 శాతం మంది ఆమోదం పొందారు. 9వ స్థానంలో 41 శాతం సమ్మతితో పోలాండ్కు చెందిన డొనాల్ టస్క్ నిలిచారు. 10వ స్థానంలో 40 శాతం సమ్మతితో ఇటలీకి చెందిన జియార్జియా మెలోని నిలిచారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో సంచలనాలు సృష్టిస్తున్న ట్రంప్ అమెరికన్ల అభిమానం పొందడంలో వెనుకబడి ఉన్నారు. సుంకాలు, పౌరసత్వం విషయాల్లో రోజుకు మాట మాట్లాడుతూ అమెరికా స్థాయిని దిగజార్చుతున్న ట్రంప్‌నకు ప్రజామోదం ప్రమాదంలో ఉన్నట్లు కనిపిస్తున్నది. 8వ స్థానంలో నిలిచిన ట్రంప్‌నకు సమ్మతిగా 44 శాతం, అసమ్మతిగా 50 శాతం మంది తమ అభిప్రాయాలను తెలపడం ట్రంప్‌నకు జనాదరణ తగ్గుతున్నట్లు తెలుస్తున్నది. ఆమోదించిన వారి కన్న వ్యతిరేకించిన వారే అధికంగా ఉండడంతో నేడు ఎన్నికలు జరిగితే ట్రంప్ ఓటమి ఖాయమని నిపుణులు అంచనా.

ప్రపంచ అత్యంత ప్రజాదరణ పొందిన పొందిన ప్రజాస్వామ్య నాయకుడిగా నిలిచిన నరేంద్ర మోదీ మరో రాజకీయ చరిత్రను సృష్టించారు. 25 జూలై 2025 నాటికి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ అంతరాయం లేకుండా 4,078 రోజులు పూర్తి చేసిన రెండవ ప్రధానిగా గతంలో ఇందిరాగాంధీ నెలకొల్పిన 4,077 రోజుల రికార్డును అధిగమించారు. జవహర్ లాల్ నెహ్రూ 15 ఆగష్టు 1947 నుంచి 27 మే 1964 వరకు 16 ఏండ్ల 286 రోజుల పాటు నిరాటకంగా 6,126 రోజుల పాటు ప్రధానిగా సేవలు అందించి తొలి స్థానంలో నిలిచిన విషయం మనకు తెలుసు. అత్యధిక రోజులు ప్రధానమంత్రిగా సేవలు అందించిన కాంగ్రేసేతర పార్టీ నాయకుడిగా కూడా నరేంద్ర మోదీ రికార్డును నెలకొల్పారు. గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, భారత ప్రధాన మంత్రిగా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికై 24 ఏండ్ల పాటు ప్రజాసేవలో దేశాభివృద్ధిని శ్వాసించే స్వాప్నికుడిగా నిలవడం మన భారతీయులకు గర్వకారణం.

**(మార్నింగ్ కన్సల్ట్ సర్వే ఆధారంగా)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037





# రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఎంవీకే శత జయంతి సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం
- పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

**అవనిగడ్డ, జూలై 30(మనం న్యూస్):** రక్తదానం ప్రాణదానంతో సమానం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం అవనిగడ్డలోని బుద్ధప్రసాద్ కార్యాలయంలో రెడ్ క్రాస్ స్వచ్ఛంద రక్తదాన శిబిరం వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా ఆగస్ట్ 4వ తేదీ ఉదయం 9గంటలకు అవనిగడ్డ గాంధీక్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ, మోపిదేవి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్సలు పొందే రోగులు, క్షతగాత్రులకు రక్తం అవసరం పెరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. డిగ్రీ చదివే విద్యార్థులు, యువత, జనసైనికులు, తెలుగు యువత కార్యకర్తలు, దివిసీమ రక్తదాతలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఎస్.వీ.ఎల్ క్రాంతి విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమా మహేశ్వరరావు, విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ పంద్రాజు నాగ వెంకట లంకమ్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మలకు ఉపాధి కల్పన..! కోట్ల దోపిడీ

- ఎన్టీఆర్ జిల్లాలో సంచలనం..
- చనిపోయిన వారి పేరులతో భారీ అవినీతి
- ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పరాకాష్ట



**విజయవాడ పశ్చిమ, జూలై 30(మనం న్యూస్):** మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ఎంతో ముందు చూపుతో, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్న కూలీలకు స్థానిక గ్రామంలో ప్రభుత్వం పని కల్పించి, వారికి వేతనాల రూపంలో నగదును చెల్లిస్తుంది. పని లేక పొట్ట చేతబట్టుకుని వలస వెళ్లే కార్మికుల వెతలు తీర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన మంచి పథకం ఇది. కానీ, ఇది రాను రాను అక్రమార్కులకు కాసులు కురిపించే పథకంగా మారింది. లక్షలాది రూపాయలు బడుగు, బలహీన వర్గాల ఆకలి తీర్చాల్సిన డబ్బు అవినీతి పరుల చేతుల్లో బందీ అయ్యింది. అన్నార్థులు ఆకలితోనే అలమటిస్తున్నారు. పథకం పక్క దారి పట్టింది. పర్యవేక్షించాల్సిన అధికారులు నిద్ర నటిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం 24 పంచాయతీల్లో దాదాపు 100 మందికి పైగా చనిపోయిన వారు పని చేస్తున్నట్లు చూపించారు. వీరు తాజాగా చనిపోయిన వారు కాదు. ఏడాది నుంచి మూడేళ్ల వ్యవధిలో మృతి చెందినా గానీ ఇప్పటికీ జాబితాలో ఉండి జీతాలు తీసుకుంటున్నారు. వారి పేరుతో వైకాపా పాలనలో రూ. లక్షల్లో వేతనాలు చెల్లించినట్లు లెక్కల్లో చూపారు. మామూలుగా అయితే ఒక కుటుంబానికి ఒక జాబు కార్డు మాత్రమే ఇవ్వాలి. ఆ కార్డుకు 100 రోజులు పని చూపిస్తారు. కానీ ఇక్కడ చాలా కుటుంబాల్లో రెండు, మూడు కార్డులు ఇచ్చేశారు. పని దినాలు పెంచి భారీగా దోచేశారు. ఒకటి కంటే ఎక్కువ కార్డులున్న కుటుంబాలు మండలంలో 500పైగా ఉన్నాయంటే దోపిడీని అంచనా వేయవచ్చు. ఒక్కో అదనపు కార్డుకు వంద రోజులు పని చేసినట్లు చూపించి అడ్డంగా దోచేశారు. అదనపు కార్డులు ఇచ్చినందుకు శ్రామికుల నుంచి కమీషన్లు వసూలు చేశారు. ఒకే పనిని ఇద్దరు ముగ్గురు క్షేత్ర సహాయకులు చేయించినట్లు చూపించడం, రికార్డుల్లో నమోదు చేసి బిల్లులు చేసుకున్న పని విస్తీర్ణానికి, క్షేత్రంలో చేసిన పనికి పొంతన లేకపోవడం, అసలు పని చేయకుండానే గతంలో చేసిన పనులు చూపి బిల్లులు చేయడం వంటి అక్రమాలు భారీగా జరిగినట్లుగా తెలుస్తోంది. రూ.3 కోట్లకు పైగా నొక్కేశారు. ఇదంతా క్షేత్ర సహాయకులు, స్థానిక అధికారులు, మండల నాయకులు కుమ్మక్కై దోచేశారు.

### కోట్లు కొల్లగొట్టిన వైఎస్సార్సీపీ నేతలు

వైకాపా పాలనలో గంపలగూడెం మండలంలో ఉపాధి పనుల్లో గూడు పుఠాణి జరిగినట్లు తెలుస్తోంది. మృతులకు హాజరు వేసి జీతాలు ఇచ్చి కోట్లు కొల్లగొట్టారు. బినామీ, బోగస్ కూలీలతో పనులు చేయించినట్లు రికార్డుల్లో చూపించారు. కోట్లాది రూపాయల కూలీల డబ్బును దోచేశారు. పేరుకు మాత్రం కూలీలకు ఇస్తున్నట్లు కాకి లెక్కలు రాశారు. పని చేయకుండానే చేసినట్లు చూపించారు. అనధికారిక ప్రాంతాల్లో పని చేయించారు. ఇలా ఒకటా రెండా లెక్కకు మించిన అక్రమాలతో రూ.3 కోట్లు గోల్మాల్ చేశారు. మండలంలో 2024-25 ఏడాదికి రూ.22.86 కోట్ల పనులు చేశారు. అంటే దాదాపు పంచాయతీకి రూ.కోటి మేర కేటాయించారు. ప్రతి పంచాయతీలో అవకతవకలున్నా.. లింగాల, ఊటుకూరు, సత్యాలపాడు, రాజవరం, గాదెవారిగూడెం, అమ్మిరెడ్డిగూడెం గ్రామాల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు సమాచారం.

### ఎన్నికలు సమీస్తున్నాయని దోపిడీకి..

గతేడాది ఎన్నికల నేపథ్యం కావడంతో ప్రభుత్వం మారితే దోపిడీకి సాధ్యం కాదని క్షేత్ర సహాయకులు, నాయకులు కలిసి మార్చిలోపే 90 శాతం పనులు పూర్తి చేశారు. కొన్నిచోట్ల అసలు ఉపాధి హామీకి సంబంధం లేని పంచాయతీల్లో పారిశుద్ధ్యం, డ్రెయినేజీల నిర్వహణ, చెట్లు నరకడం, కార్యాలయాలు శుభ్రం చేయడం వంటి పనులు ఉపాధి శ్రామికులతో చేయించారు. అటు ఉపాధి హామీలో, పంచాయతీలో రెండుచోట్ల బిల్లులు పెట్టుకున్నారు. పదుల సంఖ్యలో ఉద్యోగులకు జాబ్ కార్డులు ఇచ్చి వారు పని చేయకుండానే చేసినట్లు చూపి స్వాహా చేశారు. కార్డున్న వారి తరపున బినామీలతో పని చేయించారు. కొన్ని చోట్ల వైకాపా నేతలు, అధికారుల తోటల్లో, ఇళ్లల్లో కూడా కూలీలతో పనులు చేయించారు. వైకాపా నాయకుల అండతో అధికారులు అక్రమాల వైపు కన్నెత్తి చూడలేదంటే కూలీల పైన వైసిపికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది.

# పారిశుద్ధ్య కార్మికురాలిపై టీడీపీ నేత దాడి

- బాధితురాలు ఎరుకుల సామాజిక వర్గీయురాలు
- దాడికి పాల్పడిన నేతను అరెస్టు చేయాలంటూ నిరసనకు దిగిన పారిశుద్ధ్య కార్మికులు
- మద్దతు తెలిపిన సీపీఎం సీఐటీయూ నాయకులు



**మైలవరం, జూలై 30(మనం న్యూస్):** స్థానిక పంచాయితీ పారిశుద్ధ్య కార్మికురాలుగా బిజిలి భవాని 42 ఏండ్లుగా పనిచేస్తుంది. రోజు విధులలో భాగంగా ఆమె రామకృష్ణ కాలనీలో చెత్త శుభ్రం చేస్తుండగా అదే వీధిలో నివాసం ఉంటున్న టిడిపి నేత కటారి ఉమా మహేశ్వరరావు ఇంటి వద్దకు రాగానే చెత్త ఎత్తడానికి ఆలస్యం ఎందుకు అయ్యిందని ప్రశ్నించి, మాట మాట పెరిగి వివాదం నెలకొంది. ఇందులో ఉమా మహేశ్వరరావు పంచాయతీ కార్మికురాలు భవానీపై చేయి చేసుకున్నట్లు బాధితులు మీడియాకు తెలిపింది. నోటికి పట్టని విధంగా కులం పేరుతో ద్వేషిస్తూ రెండు చెంపలపై ఇష్టానుసారంగా కొట్టి పొత్తి కడుపులో తన్నినట్టు బాధితురాలు తెలిపింది. వెంటనే కార్మికులందరు విధులు బహిష్కరించి పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసనకు దిగారు. వీరికి మద్దతుగా స్థానిక కార్మిక సంఘం నాయకుడు సిహెచ్ సుధాకర్ కూడా మద్దతు నిలిచారు. దానికి పాల్పడిన ఉమా మహేశ్వరరావు ఉద్దేశపూర్వకంగానే అరెస్టు చేయడం లేదంటూ బాధితు కుటుంబం ఆరోపిస్తుంది. రోడ్డుపై బైఠాయించిన నిరసన కారులను పోలీసులు లేపే ప్రయత్నం చేయగా మరింత ఉద్రిక్తత చోటుచేసుకుంది. పంచాయతీ పరిధిలో చెత్తను సేకరించే వాహనాలన్నీ రోడ్డుకు అడ్డంగా నిలిపి కార్మికులందరూ నిరసన తెలిపారు. దాడి జరిగి నాలుగు గంటలైనా స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ గాని, పార్టీ నాయకులు ఎవరైనా గాని దాడికి పాల్పడిన ఉమామహేశ్వరరావుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వకపోవడంతో జిల్లా స్థాయి కార్మిక నాయకులు కూడా మైలవరం చేరుకొని నిరసన తెలిపారు. దీంతో పోలీసులు బలవంతంగా బాధితురాలు భవానిని హాస్పిటల్ కు తరలించి సీఐటీయూ, సీపీఎం నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### నిరసనలో టీడీపీ నాయకుల హడావిడి

దాడికి పాల్పడిన ఉమామహేశ్వరరావు పై చర్యలు తీసుకోవాలంటూ.. కార్మికులకు మద్దతుగా సిఐటియు సిపిఎం నాయకులు ధర్నా చేస్తుంటే, కొందరు కూటమి నాయకులు అక్కడికి చేరుకొని ప్రతి దానికి కూటమి నాయకులు చేశారంటూ ఆరోపణలు చేయవద్దని, అసలు కఠారి ఉమామహేశ్వరరావుకు తెలుగుదేశం పార్టీలో సభ్యత్వమే లేదని కొందరు కూటమి నాయకులు వాగ్వాదానికి దిగారు. అనవసరంగా తెలుగుదేశం పార్టీని దిగజార్చ వద్దంటూ తెలుగుదేశం పార్టీ పరువు తీయొద్దంటూ నిరసనకారులపై వాగ్వేదానికి దిగారు.

# దళిత హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నాం

- అట్రాసిటీ కేసుల విషయమంలో అధికారులు నిర్లిప్తత కూడదు
- ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్



**విజయవాడ సెంట్రల్, జూలై 30(మనం న్యూస్):** దళితుల హక్కులను కాపాడటమే లక్ష్యంగా ఎస్సీ కమిషన్ పనిచేస్తుందని ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ తెలిపారు. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లో గల ఎస్సీ కమిషన్ ఆఫీస్ లో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణం, కుల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తామన్నారు. ఈ ఏడాది మొత్తం 135 ఎట్రాసిటీ కేసులు వచ్చాయని, అదేవిధంగా 3 నెలల్లో 78 కేసులు వచ్చాయన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 13 ఎట్రాసిటీ కేసులు వస్తే అందులో 3 కేసులు మాత్రమే నమోదు చేశారన్నారు. దీన్ని భట్టి చూస్తే అట్రాసిటీ కేసులు వచ్చినా అధికారులు వాటిని నమోదు చేయడం లేదని అని అన్నారు. కొద్దిమంది అధికారులు కేసుల నమోదు చేయడంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదు దారుడు పోలీస్ స్టేషన్ కు వస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితులు మారాలని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి బాధలో ఉన్నవాడు తమ దగ్గరకు వస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సవివరమైన రిపోర్టు పంపించాల్సి ఉందన్నారు. కమిషన్ చైర్మన్ గా విశేషాధికారాలు ఉంటాయని, షెడ్యూల్ కులాల హక్కుల పరిష్కారంలో రాజీపడేది లేదన్నారు. భూములకు సంబంధించి రీసర్వేలో పోలీసులకు ఏమైనా ఫిర్యాదులు వస్తే తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ హాస్టల్స్ లో సీట్ల కోసం చాలా డిమాండ్ ఉందని 300 సీట్లకు గాను 3,000 మంది విద్యార్థులు అప్లై చేసే పరిస్థితులు ఉన్నాయని, అధికారులు దీన్ని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సుబ్రహ్మణ్యం హత్య విషయంలో ఎమ్మెల్సీ అనంత బాబు కేసు పై చర్యలు తీసుకోవాలని కోరారు. మృతి చెందిన డాక్టర్ సుధాకర్ విషయంలో కూడా అవసరమైన న్యాయం చేస్తామన్నారు. వేధింపులతో పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితులకు ఊరట నిచ్చేలా పోలీసులు వ్యవహరించి అట్రాసిటీ పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. బాధితులు పోలీసు స్టేషన్ కు వస్తే కేసులు పెట్టడం లేదని, అధికారులు నిర్లిప్తింగా వ్యవహరిస్తున్నారన్నారు. కర్నూలు, నంద్యాలలో ఎక్కువగా అట్రాసిటీ కేసులు వస్తున్నాయన్నారు.

# గంటల కొద్దీ కొనసాగుతున్న విచారణ

- నిందితుడు వరుణ్ మద్యం కేసు

**విజయవాడ సెంట్రల్, జూలై 30(మనం న్యూస్):** మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కేసిరెడ్డి ప్రధాన అనుచరుడు వరుణ్‌ను సిట్ అధికారులు బుదవారం నాడు గంటల కొద్ది విచారిస్తున్నారు. లిక్కర్ స్కాం లో వరుణ్ కీలక పాత్ర వమించాడనే ఆరోపణల నేపథ్యంలో వరుణ్ విచారణ ప్రత్యేకత సంతరించుకుంది. కుంభకోణానికి చెందిన నగదు తరలింపు, డంప్ లో కీలకంగా వరుణ్ వ్యవహరించాడని తెలుస్తోంది. లిక్కర్ స్కాం కేసు నమోదు అవ్వగానే విదేశాలకు పారిపోయాడు. లిక్కర్ స్కాంలో ఎవరి పాత్ర ఏంటి అనే దానిపై వరుణ్ కు సిట్ ప్రశ్నలు సంధిస్తున్నట్లు సమాచారం. కేసు నమోదు అవ్వగానే ఎవరు ఎక్కడ దాక్కున్నారు? అనే సమాచారాన్ని రాబట్టేందుకు సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మిమ్మల్ని విదేశాలకు ఎవరు తరలించారు...ఆశ్రయం ఎవరు కల్పించారనీ సిట్ ప్రశ్నలు సందిస్తున్నట్లు సమాచారం. కేసిరెడ్డి గ్యాంగ్ లో పరారీలో ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి, అవినాష్ రెడ్డి, సైమన్, బొల్లారం శివకుమార్, రాజీవ్ ప్రతాప్, బెహ్రాన్ పాత్రలపై వరుణ్‌కు ప్రశ్నలు వేశారు. లిక్కర్ స్కాంలో ఎవరెవరు? ఎక్కడెక్కడ కలిసారు? ఎవరి ఆదేశాలతో లిక్కర్ స్కాం డబ్బులు హైదరాబాద్ ఫామ్ హౌస్‌లో డంప్ చేశారు? అని సిట్ ప్రశ్నలు వేసి వరుణ్ నుండి కీలక సమాచారం రాబట్టిన సిట్ అధికారులు ఇంకా ఎక్కడెక్కడ డబ్బులు డంప్ చేశారు? ఎంత మొత్తంలో డంప్ చేశారు? అనే కోణంలో కొనసాగిస్తున్నారు.

# ఆటో మ్యుటేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోండి

- విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన్‌చంద్ర



**విజయవాడ పశ్చిమ, జూలై 30(మనం న్యూస్):** ఆస్తి పన్ను పై పేరు మార్పునకు ఆటోమ్యూటేషన్ సేవలను వినియోగించుకోవాల్సిందిగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం నగర ప్రజలను కోరారు. బుధవారం నాడు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆగస్టు 1 నుండి రాష్ట్రమంతా ఈ సేవలు ఉన్నాయని, రిజిస్ట్రేషన్ జరుగుతున్న సమయంలోనే ఆస్తి పన్ను లోని పేరు మార్పు జరుగుతుందని తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్తి యజమాని పై పన్ను పేరు మార్పుకు జాప్యం తొలగించేందుకు ప్రభుత్వం ఈజ్ ఆఫ్ గవర్నెన్స్ లో భాగంగా మ్యూటేషన్ ప్రక్రియను సులభతరం చేసిందని అన్నారు. ఇకపై ఆస్తులు కొనుగోలు, అమ్మకాలు జరిగినప్పుడు పన్ను మార్పుకు కార్పొరేషన్ కు రావాల్సిన అవసరం లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్థి, ఖాళీ స్థలములపై ఉన్న పాత బకాయిలు చెల్లించి, పన్ను పేరు మార్పునకు సంబంధించిన మ్యూటేషన్ చార్జీలు చెల్లించిన వెంటనే పన్ను పేరు మార్పు పత్రమును ఎటువంటి జాప్యం లేకుండా మ్యూటేషన్ పత్రాలు పొందవచ్చని కమిషనర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాల్సిందిగా కమిషనర్ కోరారు.

# జీవనోపాధి మెరుగుదలకు ఎస్యూఎన్ఐఎల్ పథకం

- ఆంధ్రప్రదేశ్ నుంచి 40 ప్రతిపాదనలు
- కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డా. జితేంద్ర సింగ్ వెల్లడి
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం

**ఢిల్లీ, జూలై 30(మనం న్యూస్):** జీవనోపాధి కోసం స్థానిక ఆవిష్కరణలను బలోపేతం చేయడం, విస్తరించడం మరియు పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్.యు.ఎన్.ఐ.ఎల్ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 40 ప్రాజెక్ట్ ప్రతిపాదనలు అందాయని లోక్ సభలో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు సైన్స్ అండ్ టెక్నాలజీ ఎర్త్ సైన్సెస్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ రాణా లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్రమంత్రి వివరించిన ప్రకారం.. 2025 మార్చి-ఏప్రిల్లో వచ్చిన ప్రతిపాదనలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి.. గత ఐదు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా ఏడు విద్యాసంస్థలు, ఏడు స్వచ్ఛంద సంస్థలు ఈ పథకం కింద మద్దతు పొందాయి.

అమలు కోసం డిఎస్టటీ ఇప్పటివరకు రూ.610.84 లక్షలు విడుదల చేయగా, రూ.529.14 లక్షలు వినియోగించబడ్డాయన్నారు. ఈ పథకం ప్రభావంపై జరుగుతున్న సమీక్షల్లో సానుకూల ఫలితాలు కనిపించాయని మంత్రిత్వశాఖ వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాల నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి అవకాశాల పెంపు, వ్యవసాయ సాంకేతికతలు, కోళ్ల పెంపకం, వెదురు ఆధారిత ఉత్పత్తులు, నీరు ఆదా చేసే వ్యవసాయం వంటి రంగాల్లో సానుకూల ఫలితాలు సాధించిందన్నారు.

# మానవ అక్రమ రవాణాపై అప్రమత్తత అవశ్యం

- గ్రామీణ ప్రజలను చైతన్యపరచాలి
- రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ




**మచిలీపట్నం, జూలై 30(మనం న్యూస్):** మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరమని, దీనిపై అందరూ అవగాహన పెంపొందించుకొని, ఈ దోపిడీని అంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. బుధవారం మధ్యాహ్నం మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా చైర్పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ఏదైనా సంఘటన జరిగాక స్పందించడం కంటే ముందుగానే దాని గురించి తెలుసుకొని జాగ్రత్త పడితే చాలా మంచిదన్నారు. చదువు పూర్తి చేసుకొని కళాశాల నుండి బయటకు వచ్చాక తెలియని వారు మన చుట్టూ ఉంటూ ఎలా ఏం చేస్తారో తెలియదన్నారు. అమ్మాయిలు, మహిళలే కాదు యువకులు, వలస కూలీలు కూడా అక్రమ రవాణా బారిన పడుతున్నారన్నారు. సమాజంలో కేవలం లైంగిక అవసరాలకే కాదు మానవ అవయవాలు కూడా అక్రమ రవాణా జరుగుతోందన్నారు ముఖ్యంగా గ్రామాలలో ఎక్కువగా ఇటువంటి మానవ అక్రమ రవాణా జరుగుతోందన్నారు. తల్లిదండ్రులలో ఎవరో ఒకరు మాత్రమే ఉండడం, దుర్బల కుటుంబాలు అక్రమ రవాణాకు గురవుతుంటాయన్నారు స్మార్ట్ ఫోన్ చాటింగు సందేశాల ద్వారా సులభంగా డబ్బు సంపాదించే క్రమంలో ఉద్యోగాల వేటలో ఫోన్లు వస్తుంటాయని క్లిక్ చేస్తే వారి వలలో పడే అవకాశాలు ఉంటాయన్నారు.ఉద్యోగాల పేరుతో ఇంటర్వ్యూలకు రమ్మంటారు. ఒకసారి వాళ్ళ వారి ఊబిలో చిక్కుకుంటే తిరిగి బయటపడడం చాలా కష్టమన్నారు.ఆన్లైన్లో స్నేహాలు, ఫోటోలు, వీడియోలు పంచుకోవడం తోనే సమస్య మొదలవుతుందన్నారు. సాంకేతిక నైపుణ్యం బాగా తెలిసిన వారే ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నారన్నారు.ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసి నియంత్రించాలని చూసిన ప్రజల్లో సరైన అవగాహన లేకపోతే అక్రమ రవాణాను నియంత్రించడం చాలా కష్టమన్నారు. కొన్ని కుటుంబాలలో కొడుకు కూతురు మధ్య వివక్షత ఉండటంతో తల్లిదండ్రులతో గొడవపడి యువతులు బయటకు వచ్చి వారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు జాగ్రత్తగా ఆలోచించి చేయాలన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళము, తూర్పు గోదావరి విశాఖపట్నం, పల్నాడు జిల్లాల్లో కొంత మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఇందుకు ప్రధాన కారణం గంజాయి వాడకమని దాన్ని తీసుకుంటే ఆలోచన శక్తి కోల్పోతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చురుకుగా ఈగల్ బృందాలను ఏర్పాటు చేసి గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అక్రమ వినియోగాన్ని నియంత్రించేందుకు గట్టిగా చర్యలు తీసుకుంటూ ఉందన్నారు. తద్వారా నేరాల సంఖ్య అదుపులోకి వచ్చిందన్నారు. ప్రజల్లో పెద్ద ఎత్తున మానవ అక్రమ రవాణాపై అవగాహన రావాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, మానవ అక్రమ రవాణా జరుగుతుంటే ఆ సమాచారం వెంటనే పోలీసులకు ధైర్యంగా తెలియజేయడం చాలా ముఖ్యమన్నారు. ఆ విధంగా చేయడం వలన మరల అటువంటి సంఘటనలు జరగకుండా ఉంటాయన్నారు. ఎవరైనా సమాచారం ఇస్తే వారికి ఎటువంటి శిక్ష ఉండదన్నారు. దానిని పోలీసులు రహస్యంగా కూడా ఉంచుతారన్నారు. పోలీసులు కూడా తమ వంతు బాధ్యతగా మెరుగైన జవాబుదారీతనంతో విధులు నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అక్రమ రవాణా బాధితులకు రక్షణ, నష్టపరిహారం, పునరావాసంతో పాటు తగిన న్యాయం అందించాలని పోలీసులకు సూచించారు. అక్రమ రవాణాకు పాల్పడే ట్రాఫికర్లకు చట్టపరంగా కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలలో మానవ అక్రమ రవాణా జరగకుండా కొన్ని యూనిట్లు పనిచేస్తున్నాయని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వన్ స్టాప్ సెంటర్ నడుస్తోందని అక్కడ మహిళలకు ఆశ్రయము గాని కౌన్సిలింగ్ గాని వైద్య పరంగా గాని న్యాయపరంగా గాని ఎలాంటి అవసరమైన సహాయం చేసేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉంటారన్నారు. ఏమైనా అవసరమైతే మహిళా హెల్ప్ లైన్ నంబర్లు 181, 112 సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అదనపు ఎస్పీ వి నాయుడు, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే రాంజీ, రిజిస్ట్రార్ ఆచార్య ఉష ,రెక్టారు బసవేశ్వర రావు, విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు రావూరి సూయజ్ పాల్గొని మానవ అక్రమ రవాణా పై అవగాహన కల్పించారు. తొలుత మానవ అక్రమ రవాణా పై అవగాహన పెంపొందించే గోడపత్రాన్ని మహిళా చైర్పర్సన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు, ఐసిడిఎస్ అధికారులు, విశ్వ విద్యాలయం అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సుపరి పాలనలో 'తొలి అడుగు'కు విశేష స్పందన

- రెడ్డిగూడెంలో పర్యటించిన శాసన సభ్యులు కృష్ణప్రసాద్

**రెడ్డిగూడెం, జూలై 30(మనం న్యూస్):** మైలవరం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. రెడ్డిగూడెంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మైలవరం శాసన సభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. భారీ జన సందోహం నడుమ ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ప్రతి గడపకు తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆగస్టు నెలలో అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాలో తొలి విడత ఏడు వేల రూపాయలు జమ కానున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పెంపు, ల్యాండ్ టైటిల్ యాక్టర్ రద్దు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్, ఉచిత ఇసుక పాలసీ, అమలు చేస్తున్నామన్నారు. త్వరలో మిగిలిన పథకాలను కూడా అమలు పరుస్తామని తెలిపారు. సంక్షేమ పథకాలను అమలు పరుస్తూనే, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తూ, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కనుక ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. రెడ్డిగూడెంలో కూటమి నాయకులు ఎమ్మెల్యే కృష్ణప్రసాదుకి ఘన స్వాగతం పలికి, శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటికి పరిష్కారినికి కృషి చేస్తామన్నారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి శ్రీ అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.



# మద్నూర్‌లో పర్యటించిన కలెక్టర్

**కామారెడ్డి, జూలై 30 (మనం జిల్లా ప్రతినిధి) :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండలంలో బుధవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యటించి పలు అభివృద్ధి, పర్యవేక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మద్నూర్ గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ని సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై నేరుగా రోగులు, వైద్య సిబ్బందితో మాట్లాడి సమాచారం పొందారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని, సాధారణ మందులతో పాటు పాముకాటు, ఇతర అత్యవసర మందులు కూడా ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, సానిటేషన్ పనులు నిరంతరం చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు.



తదుపరి హండీ కీలూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి, 100 శాతం మార్కింగ్ అవుట్లు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా నిరంతరం పర్యవేక్షణ చేసి ఇండ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసుకునేలా లబ్ధిదారులకు సహకరించాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇసుక మరియు మొరం సరఫరాకు ఏమైనా ఇబ్బంది కలిగితే వెంటనే ఎంపీడీవోకు మరియు తాసిల్దార్ కు తెలియజేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామ పంచాయతీలలో ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించి, త్రాగునీటిని క్లోరినేషన్ చేయాలని, డ్రైనేజీలలో నీరు నిలువ ఉండకుండా పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పెద్ద ఎక్లారా గ్రామంలోని గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం విద్యార్థినిలతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్, డివిజనల్ పంచాయతీ అధికారి సత్యనారాయణ, హౌసింగ్ డిఇ గోపాల్, తహసిల్దార్ ముజీబ్, ఎంపీడీవో, తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ స్థలం కబ్జాపై చర్యలు తీసుకోవాలి



**నిజామాబాద్, జూలై 30 (మనం న్యూస్) :** నిజామాబాదు లోని వినాయక్నగర్ న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో మున్సిపల్ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని బుధవారం నుడా ఛైర్మన్ కేశవేణుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., కాలనీలోని రోడ్ నం.1లో ఖాళీగా ఉన్న 2వేల గజాల స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని, కారు షెడ్లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. అంతేగాక, అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు యత్నిస్తున్నారని, ఆ స్థలంలో కాలనీవాసులకు ఉపయోగపడేలా పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సయ్య, ప్రధాన కార్యదర్శి బాల్సింగ్ నాయక్, హన్మంత్రావు, కె లక్ష్మణ్, కమలాకర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల పునరుద్ధరణకు కృషి

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొర్రూరు, జూలై 30 (మనం న్యూస్) :** నియోజకవర్గంలోని చెరువుల పునరుద్ధరణకు కృషి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని మడిపల్లి గ్రామ ఉప్పరవాని కుంట చెరువు కు రెండు చోట్ల గండ్లు పడడంతో చెరువులో నీరు వృధాగా పోయే దుస్థితి ఏర్పడింది.ఈ విషయమై స్థానికులు పాలకుర్తి ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోగా స్పందించిన ఎమ్మెల్యే స్వంత ఖర్చుతో గ్రామ చెరువు గండ్లు పూడ్చుతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం గ్రామ చెరువును సందర్శించి కొబ్బరికాయ కొట్టి మరమ్మత్తు పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు జీవనాధారమైన చెరువుల బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తామని తెలిపారు. చెరువులను పునరుద్ధరించి నీటి నిల్వ సామర్థ్యం పెంచుతామన్నారు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటేనే గ్రామాల్లో భూగర్భ జలాలు పైకి వస్తాయన్నారు. మత్స్య పరిశ్రమ గణనీయ వృద్ధి చెందుతుందని, జీవాలు, పాడిపశువులకు నీటి కొరత తీరిపోతుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గం లో నీటి వనరుల వృద్ధితో క్రమంగా చెరువులు



పూర్వవైభవాన్ని సంతరించుకునేల కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతు పక్షపాత ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, నాయకులు చాపల బాపురెడ్డి, డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు, పెదగాని సోమయ్య, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, మంగళపల్లి రామచంద్రయ్య, జీనుగ సురేందర్ రెడ్డి స్థానిక పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బయోమెట్రిక్



- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి కుమార్

**నిజామాబాద్, జూలై 30 (మనం బ్యూరో) :** ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయనున్నట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం డీఐఈవో కార్యాలయంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయడానికి విద్యార్థుల బయోడేటా ఆధార్ ఇంటర్ బోర్డు లాగిన్‌ను నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. అపార్ గుర్తింపు లేనివారికి వెంటనే నెంబర్ కేటాయించాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల సమయపాలన పాటించాలని, ఇందుకు ప్రిన్సిపాళ్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. కళాశాల ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నందున యూనిట్ టెస్ట్‌లను పూర్తిచేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 4,386 మంది విద్యార్థులు చేరారని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను తొందరగా ఏర్పాటు చేయాలని డీఐఈవో రవికుమార్ ఆదేశించారు. అలాగే పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలన్నారు. ఇంటర్ బోర్డు కేటాయించిన నిధులతో తరగతి గదులు, ఫర్నిచర్, విద్యుత్ మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను వెంటనే అమలు చేయాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్

**నిజామాబాద్, జూలై 30 (మనం బ్యూరో) :** కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.



వేల్పూర్‌లోని తన కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులపై సంతకాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తగా వివాహాలు జరిగిన వారికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో భాగంగా అదనంగా ఇస్తామన్న తులం బంగారం పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భీమ్‌గల్‌లో 136, మెండోరా 46, మోర్తాడ్ 27 ఇలా మొత్తం 244 దరఖాస్తులు వచ్చాయన్నారు. కొత్తగా చెక్కులు మంజూరయ్యే లబ్ధిదారులకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులపై ఎప్పటికప్పుడు సంతకాలు చేసి ప్రభుత్వానికి పంపుతున్నామని పేర్కొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# మీ ప్రవర్తన నమ్మశక్యంగా లేదు

## జస్టిస్ యశ్వంత్ వర్మపై సుప్రీం అసహనం

**ఢిల్లీ, జూలై 30 :** ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. త్రిసభ్య విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం సుప్రీంలో విచారణ జరిగింది. ఈసందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

వర్మ తరపు న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ.. న్యాయమూర్తిని



తొలగించాలని అంతర్గత విచారణ ప్యానెల్ చేసిన సిఫార్సు రాజ్యాంగవిరుద్ధమన్నారు. దీనిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. 'మీ ప్రవర్తన నమ్మశక్యంగా లేదు. రాజ్యాంగ విరుద్ధమని భావిస్తే విచారణకు ఎందుకు హాజరయ్యారు. దీనిపై ముందే సవాల్ చేయాల్సింది కదా' అని అసహనం వ్యక్తంచేసింది. న్యాయపరమైన తప్పులు జరిగినప్పుడు దానిపై చర్య తీసుకునే హక్కు భారత ప్రధాన న్యాయమూర్తికి ఉంటుందని జస్టిస్ దత్తా ఈసందర్భంగా వ్యాఖ్యానించారు. ఇక, ఈ పిటిషన్‌కు సంబంధించిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం రిజర్వ్ చేసింది.

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలు ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా.. అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని తేల్చింది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ వర్మకు సీజేఐ సూచించారు. ఆయన తిరస్కరించడంతో.. అభిశంసనకు సిఫారసు చేశారు. జస్టిస్ వర్మ అభిశంసనకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# బీజేపీ తమిళనాడు ఉపాధ్యక్షురాలిగా ఖుష్బూ

**చెన్నై, జూలై 30 :** సినీ నటి, బీజేపీ నాయకురాలు కుష్బూ సుందర్‌కు బీజేపీలో ముఖ్యమైన పదవి దక్కింది. తమిళనాడు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఆమె నియమితులయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు



జేపీ నడ్డా ఆమోదంతో కొత్త రాష్ట్ర వర్గాన్ని నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 14మంది నియమితులు కాగా.. ఈ జాబితాలో ఖుష్బూ సుందర్‌కు చోటు దక్కింది. అలాగే, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఐదుగురు, రాష్ట్ర కార్యదర్శులుగా 14 మందితో కూడిన జాబితాను నయనార్ నాగేంద్రన్ తన 'ఎక్స్'ఖాతాలో షేర్ చేసుకున్నారు. ఖుష్బూ ప్రస్తుతం జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా, బీజేపీ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

# 127 ఏళ్ల అనంతరం.. భారత్‌కు బుద్ధుడి అవశేషాలు

**ఢిల్లీ, జూలై 30 :** బ్రిటిష్ హయాంలో భారత్ నుంచి తరలిపోయిన బుద్ధుని పవిత్ర అవశేషాలను 127 ఏళ్ల తర్వాత స్వదేశానికి తిరిగి తీసుకొచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దేశ సాంస్కృతిక వారసత్వానికి సంతోషకరమైన రోజుగా పేర్కొన్నారు. 1898లో ఉత్తరప్రదేశ్‌లోని పిపర్‌హవా ప్రాంతంలో చేపట్టిన తవ్వకాల్లో బయటపడిన ఆ పవిత్ర అవశేషాలను.. వలస పాలన సమయంలో మన దేశం నుంచి తరలించారని గుర్తుచేశారు.

''బుద్ధుని పవిత్ర 'పిపర్‌హవా' అవశేషాలు 127 ఏళ్ల తర్వాత తిరిగి భారత్‌కు తీసుకురావడం దేశవాసులందరికీ ఎంతో గర్వకారణం. బుద్ధుడు, ఆయన బోధనలతో దేశానికి ఉన్న అనుబంధాన్ని ఈ పవిత్ర అవశేషాలు చాటిచెబుతున్నాయి. అదేవిధంగా అద్భుతమైన సంస్కృతిని



పరిరక్షించడం పట్ల మన నిబద్ధతను చాటుతున్నాయి. ఈ అవశేషాలు 1898లో వెలుగులోకి వచ్చాయి. కానీ.. వలసపాలనలో భారత్ నుంచి వేరే ప్రాంతానికి తరలించారు. ఈ ఏడాది ప్రారంభంలో ఓ అంతర్జాతీయ వేలంలో అవి కనిపించాయి. దీంతో వాటిని తిరిగి స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగమైన వారందరికి అభినందనలు'' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. పిపర్‌హవా ప్రాజెక్టు వెబ్‌సైట్ వివరాల ప్రకారం.. 1898లో యూపీలో భారత్- నేపాల్ సరిహద్దు సమీపంలోని పిపర్‌హవాలో ఓ పురాతన బౌద్ధ స్తూపం తవ్వకాల సమయంలో పెద్ద రాతిపెట్టెలో కొన్ని అవశేషాలు బయటపడ్డాయి. ఇందులో గౌతమ బుద్ధునికి చెందినవిగా భావిస్తున్న అస్థి అవశేషాలు, పేటికలు, బంగారు ఆభరణాలు, రత్నాల వంటివి ఉన్నాయి. బౌద్ధులకు పంపిణీ చేసేందుకుగానూ.. ఆ పవిత్ర అస్థి అవశేషాలను సియామ్ (ప్రస్తుత థాయ్లాండ్) రాజుకు అప్పగించినట్లు వెబ్‌సైట్ చెబుతోంది. అప్పట్లో అవశేషాలను ఉంచిన ఆ పెద్ద రాతి పెట్టె ప్రస్తుతం కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంలో ఉంది.

# రహస్య టన్నెల్‌ను మూసేశారు

## పహల్గాం ఉగ్రవాదులను మట్టుబెట్టారు..!

**ఢిల్లీ, జూలై 30 :** పహల్గాం ఉగ్ర దాడి ముష్కరులను 'ఆపరేషన్ మహాదేవ్' ద్వారా హతమార్చామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం లోక్‌సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఈవిషయాన్ని ఆయన ధ్రువీకరించారు. ఈ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు చివరిసారిగా ఎం-9, రెండు ఏకే 47 తుపాకులు ఉపయోగించారు. ఆ తర్వాత మూడు నెలల పాటు ఉగ్రవాదులు సులేమాన్, అఫ్గానీ, జిబ్రాన్ ఎవరికంటా పడకుండా దాక్కున్నారు. అయితే.. పాకిస్థాన్ జాతీయులైన వీరు తిరిగి తమ దేశానికి వెళ్లలేకపోయారు. భద్రతా



దళాల వ్యూహం కారణంగా వారు తప్పించుకోలేకపోయారు. పహల్గాం దాడి అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉన్నతాధికారులు కశ్మీర్‌కు వెళ్లిన సమయంలోనే ఈ వ్యూహాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ముష్కరులు తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లకుండా చూడాలని అమిత్ షా భద్రతా బలగాలకు స్పష్టంచేసినట్లు సమాచారం. ఉగ్రవాదులు వినియోగించిన 8 కి.మీ. మార్గాన్ని భద్రతా బలగాలు గుర్తించి.. ఆ ప్రాంతంలో సెక్యూరిటీని కట్టుదిట్టం చేశాయి. ముష్కరులు చొరబాటుకు ఉపయోగించిన ఓ రహస్య టన్నెల్‌ను భద్రతా బలగాలు గుర్తించాయి. ఆ సొరంగాలను వరదలతో ముంచెత్తించారు. దీంతో ఉగ్రవాదులు తప్పించుకునే మార్గం లేకుండా పోయింది. ఆ తర్వాత దళాలు ముష్కరులు ఉన్న ప్రాంతాన్ని ట్రాక్ చేసి.. వారిని మట్టుబెట్టాయి. ఇక 'ఆపరేషన్ మహాదేవ్'లో చనిపోయింది పహల్గాంలో దాడికి పాల్పడిన వారా? కాదా? అనే విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాతే పార్లమెంటులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేశారు. ''ముగ్గురు ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న ఒక ఎం-9, రెండు ఏకే-47 తుపాకులను సోమవారం రాత్రి ప్రత్యేక విమానంలో శ్రీనగర్ నుంచి చండీగఢ్ పంపాం. అక్కడి కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించాం. ఆ తుపాకుల నుంచి తూటాలు ప్రయోగాత్మకంగా నిపుణులు పేల్చి చూశారు. అనంతరం ఖాళీ తూటాలను.. పహల్గాం వద్ద లభ్యమైన వాటితో పోల్చి చూశారు. పహల్గాం ఊచకోతలో వాడింది ఈ తుపాకులేనని మంగళవారం తెల్లవారుజామున 4.46 గంటలకు ఆరుగురు ఫోరెన్సిక్ నిపుణులు వీడియోకాల్ ద్వారా నాకు తెలియజేశారు'' అని అమిత్ షా పేర్కొన్నారు.

# ఆ 2వేల మందికి కోర్టు చాలదు..

## స్టేడియం కావాలి: తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీం వ్యాఖ్యలు

**ఢిల్లీ, జూలై 30 :** మాజీమంత్రి సెంథిల్ బాలాజీ కేసు విషయంలో తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేశారని బాలాజీపై అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసుపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మాజీమంత్రి సెంథిల్ బాలాజీ కేసు విచారణను తమిళనాడు ప్రభుత్వం కావాలని ఆలస్యం చేస్తున్నట్లు కనిపిస్తోందని ఇప్పటికే ఈ కేసు విచారణలో భాగంగా సుప్రీం ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వం కేసును మూసివేయడానికి ప్రయత్నిస్తే న్యాయశాఖ అడ్డుకుందని తాజాగా మందలించింది. ''ఈ కేసులో 2000 మంది నిందితులు, 500 మంది సాక్షులు ఉన్నారు. భారత్‌లో అత్యధిక మంది విచారణలో పాల్గొన్న కేసు ఇదే అవుతుందేమో.



అలాగే ఆ నిందితులందరికీ ఈ కోర్టు గది సరిపోదు.. ఒక క్రికెట్ స్టేడియం కావాలి'' అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరిట కొందరి నుంచి లంచాలు తీసుకున్నారంటూ ఆయనపై కేసులు నమోదయ్యాయి.

ఆ తర్వాత ఆయన డీఎంకేలో చేరి మంత్రి అయ్యారు. పాతకేసులో సెంథిల్ బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 2023లో అరెస్టు చేసింది. ఏడాదికిపైగా జైల్లో ఉన్న ఆయన గతేడాది బెయిల్‌పై బయటికొచ్చారు. ఆయనను స్టాలిన్ సర్కారు వెంటనే మళ్లీ మంత్రిని చేసింది. ఈ కేసులో సుప్రీంకోర్టుకు చేరడంతో సెంథిల్ బాలాజీ తన పదవికి రాజీనామా చేసిన సంగతి విదితమే. నిన్నటి విచారణలో.. ''నాడు ఉద్యోగాల కోసం డబ్బులు ముట్టజెప్పిన 2 వేల మంది నుంచి 2,500 మంది బాధితులను.. లంచాలిచ్చిన వారంటూ రెండు కేసుల్లో నిందితులుగా చేర్చడానికి కారణమేమిటి? వారందరినీ విచారించడం ఎప్పటికి పూర్తవుతుంది?'' అని మందలించిన సంగతి తెలిసిందే

# ఉక్రెయిన్ జైలు, ఆసుపత్రిపై రష్యా దాడులు 22 మంది మృతి

**కీవ్,జూలై 30 :** ఉక్రెయిన్‌లోని జైలు, వైద్య సదుపాయాల కేంద్రంపై రష్యా సోమవారం అర్ధరాత్రి బాంబులు, క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో కనీసం 22 మంది పౌరులు మృతి చెందినట్లు ఉక్రెయిన్ అధికారులు మంగళవారం వెల్లడించారు. ఆగ్నేయ జపోరిఝియా ప్రాంతంలోని జైలును శక్తిమంతమైన నాలుగు గ్లైడ్ బాంబులు తాకాయని, ఈ దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోగా 80 మంది ఖైదీలు గాయపడినట్లు తెలిపారు. మధ్య ఉక్రెయిన్‌లోని డినిప్రో ప్రాంతంలో ఓ ఆసుపత్రి వార్డు, మూడంతస్తుల భవనంపైకి క్షిపణులు దూసుకు రాగా ఐదుగురు మృతి చెందారని, 8 మంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపి శాంతి నెలకొల్పేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇదివరకు ఇచ్చిన 50 రోజుల గడువును కుదిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సోమవారం నాడే ఈ దాడులు జరిగాయి. మరో 10-12 రోజుల్లో శాంతిచర్చలు కొలిక్కి రాకపోతే ఆంక్షలు, సుంకాలు మరింత పెంచుతానన్న ట్రంప్ హెచ్చరికలను రష్యా పట్టించుకోలేదని స్పష్టమవుతోంది.

# పాక్ లింకులేంటో చెప్పాలి

## గౌరవ్ గొగోయ్‌కు హిమంత హెచ్చరిక

**ఢిల్లీ, జూలై 30 :** పాకిస్థాన్‌తో లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ సతీమణికి ఉన్న సన్నిహిత సంబంధాలేమిటని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రశ్నించారు. సెప్టెంబర్ 10వ తేదీలోగా ఆ వివరాలను బహిర్గతం చేయకపోతే.. ఆమెపై రాష్ట్రం ప్రస్తుతం జరుపుతున్న దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు బదిలీ చేస్తానని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంలో లోతైన విచారణ అవసరమని భావించి.. తమ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీనిని ఈ ఏడాది ద్వితీయార్థంలో ఎన్ఐఏకు బదిలీ చేయాలని సూచిస్తానని చెప్పారు.

గొగోయ్ సతీమణి ఎలిజిబెత్ కోల్‌బర్న్ పాకిస్థాన్‌ను పలు మార్లు సందర్శించారని బీజేపీ ఆరోపించింది. అంతేకాదు.. ఆ దేశ జీతంపై పనిచేస్తున్నారంటూ విమర్శించింది.



పార్లమెంట్‌లో కూడా ఈ అంశం చర్చకు వచ్చింది. దీనిపై గౌరవ్ కూడా సమాధానం చెబుతూ ''ప్రధాని మోడీ పాకిస్థాన్‌కు వెళ్లకముందే ముందే అక్కడికి వెళ్లాను. ఆ విషయాన్ని అమిత్‌షా ఎందుకు ప్రస్తావిస్తున్నారో తెలియడంలేదు'' అని పేర్కొన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను దాచిపెడుతోందని పేర్కొన్నారు.

ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్‌పై మాట్లాడుతూ మన దేశంపై పాక్ కుట్రలను సాగనివ్వకూడదని గౌరవ్ గొగొయ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం సభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా రాగలిగారో ప్రభుత్వం చెప్పలేదన్నారు. ఆపరేషన్‌లో మనం ఎన్ని విమానాలు కోల్పోయాం? సైనిక చర్య నిలిపివేతకు ఎవరి ముందు మోడీ లొంగిపోయారు? పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకునేది ఎప్పుడు?.. అనేవి వివరించాలని డిమాండ్ చేశారు. దేశానికి, సైన్యానికి అనుకూలంగానే తాము మాట్లాడుతున్నామని, శత్రువులుగా మాత్రం తమను పరిగణించవద్దని అన్నారు. ఈ వ్యాఖ్యల తర్వాత హిమంత బిశ్వశర్మ హెచ్చరికలు వెలువడటం గమనార్హం.

# అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తే ప్రధానం




- రెవెన్యూ సేవల దరఖాస్తులపై సత్వరం స్పందించండి.
- జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

**విజయవాడ సెంట్రల్, జూలై 30 (మనం న్యూస్)** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే అర్జీలను గడువులోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించడం ప్రధానమని.. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ.. ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వే, పౌర సరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. భూ సేకరణ, రీ సర్వే, కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు, కొత్త రేషన్ కార్డులు, ఈ-కేవైసీ, ప్రజా పంపిణీ వ్యవస్థ సరుకుల పంపిణీ తదితర అంశాలతో పాటు పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కార నాణ్యత నిర్ధారణకు అర్జీదారుల సంతృప్తే గీటురాయని.. సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కారానికి కృషిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ సేవల దరఖాస్తులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ నాణ్యతతో సేవలందించాలని సూచించారు. రీసర్వే కార్యకలాపాలను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిచేసేందుకు చొరవ చూపాలన్నారు. జాతీయ రహదారులతో పాటు వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ కార్యకలాపాల్లో వేగం పెంచాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) పటిష్ట అమలుకు చొరవ చూపాలని, క్షేత్రస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు చౌక ధరల దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, పౌర సరఫరాల అధికారి ఎ.పాపారావు, సర్వే-ల్యాండ్ రికార్డుల ఏడీ పి.త్రివిక్రమరావు, కేఆర్సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు ఆత్మ రక్షణపైన అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు, శక్తి టీం బృంధాలు


**విజయవాడ తూర్పు, జూలై 30 (మనం న్యూస్)** మహిళలు, బాలికల యొక్క రక్షణ కొరకు కల్పించబడుతున్న మహిళా చట్టాలను గురించి మహిళలకు, విధ్యార్థినీ విధ్యార్థులకు శక్తి యాప్, 112 (అత్యవసర సేవలు), 1930 (సైబర్ మోసాల నివేదికల కోసం), 1098 (బాలల హెల్ప్లైన్), 181 (మహిళల హెల్ప్లైన్), 1073 (ట్రాఫిక్ సమాచారం కోసం), 101 (ఫైర్ ఎమర్జెన్సీ) వంటి కీలకమైన టోల్-ఫ్రీ నెంబర్ లపై విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా ఆపద సమయాలలో ప్రజలకు మేము ఉన్నాం అనే భరోసా కల్పించాలనే సదుద్దేశంతో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిదిలోని శక్తి టీం బృంధాలు, మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి నగరంలోని వివిధ ప్రదేశాలలో మహిళలకు, బాలికలకు వారి రక్షణకు కల్పించబడిన మహిళా చట్టాల గురించి శక్తి యాప్ వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించారు. ఈ నేపథ్యంలో బుదవారం నాడు పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని కె.కె.ఆర్.గౌతమ్ స్కూల్ నందు విద్యార్థినీ విద్యార్థులకు ఆపద సమయాలలో ఏ విధంగా తమని తాము రక్షించుకోవాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ( సెల్ఫ్ డిఫెన్స్) గురించి, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంటే ఏంటి అనే విషయాల గురించి, ఈవ్ టీజింగ్ చేయడం వలన కలిగే నష్టాల గురించి, ఎల్.హెచ్.ఎం.ఎస్., సి.సి.కెమెరాల వలన ఉపయోగాలు, సోషల్ మీడియా మరియు సైబర్ ద్వారా జరిగే నేరాల గురించి మరియు నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పోక్సో యాక్ట్ గురించి, డైయల్ 112 , మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం మొదలగు అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా శక్తి టీం బృంధాలు నగరంలోని వివిద ప్రదేశాలలోని మహిళలకు, యువతులతో మాట్లాడి శక్తి యాప్ అనేది అక్రమార్కుల పాలిట ఆయుధంగా మారుతుందని, మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలకు యువతులకు శక్తి యాప్ వలన ఉపయోగాలను తెలియజేసి వారి ఫోన్ లలో శక్తి యాప్ లను డౌన్ లోడ్ చేయించినట్లు పేర్కొన్నారు.

## ప్రసాదం లడ్డు తయారీ కేంద్రంలో ఈవో తనిఖీ



**విజయవాడ పశ్చిమ, జూలై 30 (మనం న్యూస్)** దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. సీన నాయక్, బుధవారం నాడు లడ్డు ప్రసాదం తయారీ యూనిట్ లో తనిఖీలు చేపట్టారు. భక్తులకు అందించే ప్రసాదాల తయారీలో అత్యున్నత నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను నిర్ధారించడానికి, భక్తులకు అందించే ప్రసాదాల తయారీలో అత్యున్నత నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను నిర్ధారించడానికి, భక్తులకు మెరుగైన మౌలిక వసుతులు కల్పించడంలో భాగముగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఇఒ వి.కె. సీన నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భన సమయంలో, కార్యనిర్వహణాధికారి లడ్డు ప్రసాదం తయారీ కోసం అమలులో ఉన్న నాణ్యత నియంత్రణ ప్రక్రియలను నిశితంగా పరిశీలించారు. ఇందులో ముడి సరుకుల సేకరణ, ప్రామాణిక వంటకాలను పాటించడం, ప్రసాదం పోటులో పరిశుభ్రమైన వాతావరణాన్ని నిర్వహించడం వంటి అంశాలపై దృష్టి సారించారు. ప్రసాదాల, ముఖ్యంగా పూజనీయమైన లడ్డు ప్రసాదం యొక్క స్వచ్ఛత మరియు నాణ్యతను కాపాడటం దేవస్థానానికి అత్యంత ప్రాముఖ్యతనిస్తుందని ఆయన అన్నారు. కార్యనిర్వహణాధికారి లడ్డు ప్రసాదం తయారీలో పాల్గొన్న సిబ్బందితో మాట్లాడుతూ స్థిరపడిన నిబంధనలు మరియు ప్రమాణాలకు ఖచ్చితంగా కట్టుబడి ఉండాలని చెప్పారు. అన్ని ప్రసాదాల నాణ్యత, భద్రతను నిర్ధారించడానికి ఆలయ అధికారులు దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఉన్నత-నాణ్యత, పరిశుభ్రమైన ప్రసాదాలతో భక్తులకు సేవ చేయడానికి, ఆలయ పవిత్రత, సంప్రదాయాలను నిలబెట్టడానికి కట్టుబడి ఉందన్నారు. రానున్న రోజులలో కొత్త ప్రసాద తయారీ లడ్డు పోటు భవనము లోకి మారుటకు అన్ని చర్యలు తీసుకొనుచున్నామని, రానున్న దసరా ఉత్సవముల అవసరములకు అనుగుణముగా దేవస్థాన సిబ్బంది సమయాత్తం కావాలని అదేశించినట్లు పేర్కొన్నారు.

## గర్భగుడి ఫొటోలు సోషల్ మీడియాలోకి ఎలా వచ్చాయి?



**విజయవాడ, పశ్చిమ, జూలై 30 ( మనం న్యూస్)** ఉగాది రోజున, దసరా మొదటి రోజున, పవిత్రోత్సవాల సమయంలో ఈ మూడు రోజులలో మాత్రమే అమ్మవారి స్నపన (అభిషేక పూర్వక స్నానం) జరుగుతుంది. అటువంటి సమయంలో సాక్షాత్తు ప్రధాని కూడా దర్శనం చేసుకోలేరు. కేవలం అర్చకులు, వేద పండితులు మాత్రమే ఉండే ఆ సమయంలో ఈ ఫోటోలు ఎవరు తీశారు...? సోషల్ మీడియాలో ఈ ఫోటోలు ఎలా హల్ చల్ చేస్తున్నాయి..? ఫోటోలు తీయడానికి వైదిక కమిటీ అమతులు ఏమైనా ఇచ్చిందా..? ఫోటోలు తీస్తుంటే కళ్లు మూసుకున్నారా..? లేక సహకరించిందా అనే అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి. దీనికి భాద్యత వైదిక కమిటీయే వహించాలనే వాధనలు వినిపిస్తున్నాయి. వైదిక కమిటీ విధులను సక్రమంగా నిర్వహించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తుల పూజలు జరుగుతున్నా పరిశీలించాలి, ఇంతకీ ఈ ఫోటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్న విషయం ఇఒ కు తెలుసా..? లేక తెలియదా..? మొదట ఈ ఘటన పైన సీరియస్ అవ్వాల్సిన వైదిక కమిటీ ఏంచేస్తుందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆలయ ఇఒ ఎందుకు విచారణ చేపట్టలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ పవిత్రతను కాపాడాల్సిన వైదిక కమిటీ మౌనం వెనుకున్న అంతరార్థం దేనికి సంకేతమో ఆ దుర్గమ్మకే తెలియాలంటున్నారు భక్తులు. ఇప్పటికైనా గర్భ గుడిలోని ఫోటోలు సోషల్ మీడియా చెంతకు ఏవిధంగా చేరాయనే విషయం పైన ఇఒ దృష్టి సారించి, విరాచణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## నేడు మహా పూర్ణాహుతి, ఆలయ ప్రవేశం



- ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లికార్జున

**విజయవాడ తూర్పు, జూలై 30 (మనం న్యూస్):** విజయవాడ, పున్నమ్మతోటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు ఈ నెల 31వ తేదీ గురువారంతో ముగియనున్నాయని ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లికార్జున బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు 5,000 మందికి అన్న ప్రసాద వితరణతో కార్యక్రమం ముగియనున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో పున్నమ్మతోటలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను ఆగమ శాస్త్ర ప్రకారం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని.. బుధవారం సాయంత్రం విశేష మహాశాంతి తిరుమంజనం, ధాన్యాధివాసం మరియు సర్వదైవత్య హోమాలు జరిగినట్లు తెలిపారు. 31వ తేదీన మహాపూర్ణాహుతి, ఆలయప్రవేశం, కుంభాత్ బింబ సమారోహణం, కళావాహనం, ప్రథమ కళార్చనము, మహాసంప్రోక్షణ, అక్షతారోహణ కార్యక్రమాలు జరుగుతాయని.. బ్రహ్మఘోషతో కార్యక్రమం ముగియనున్నట్లు వివరించారు. కావున భక్తులందరూ ఈ విశేష హోమాలు, స్వామి వారిని దర్శించి అన్న ప్రసాదం వితరణను స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని తిరుమల తిరుపతి దేవస్థానం తరపున కోరుతున్నట్లు మల్లికార్జున తెలిపారు.

## బాపులపాడు ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యాశాఖా కమీషనర్ల సందర్శన



**బాపులపాడు, జూలై 30 (మనం న్యూస్)** కృష్ణా జిల్లా బాపులపాడు జిల్లా పరిషత్ ఉన్నత ప్లస్ పాఠశాలకు పాఠశాల విద్యాశాఖ కమీషనర్ వి.విజయరామరాజు ఐఏఎస్, ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి కృతిక శుక్లా ఐఏఎస్ లు సందర్శించారు. పర్యటనలో భాగంగా పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థుల ఫలితాలు, వారి యొక్క విద్యా సామర్థ్యాలను తెలుసుకునేందుకు తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. అదేవిధంగా ప్లస్ టు ఇంటర్మీడియట్ విద్యార్థుల యొక్క రోలు వారి యొక్క ఉత్తీర్ణత శాతాలు, ఈ విద్యా సంవత్సరానికి రావలసిన పాఠ్యపుస్తకాలు విద్యా విషయక వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాటశాలలో ఉపాధ్యాయులు అందరిని ఈ సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత వంద శాతం వచ్చే విధంగా కృషి చేయాలని సూచనలు చేశారు. విద్యార్థులు చాలా చురుగ్గా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత ప్లస్ టు పాఠశాల వీరవల్లిలో ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి కృతిక శుక్లా విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తీర్ణత శాతం టీచింగ్ స్టాఫ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనానికి తగిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. 6వ తరగతి నమోదు ప్రక్రియ మరింత మెరుగ్గా ఉండాలని విద్యార్థుల శాతం పెరగాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసుకు తెలియజేశారు. సందర్శనలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె రామారావు, ఉప జిల్లా విద్యాశాఖ అధికారి కే. రవికుమార్, మండల విద్యాశాఖ అధికారులు రామ్ బాలసింగ్ మరియు జి. డేవిడ్ రత్నరాజు సమగ్ర శిక్ష సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్ వై శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి సుంకర సుభాష్ చంద్రబోస్, వీరమాచినేని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేర నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకే 'పల్లె నిద్ర'



- జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు

**అవనిగడ్డ, జులై 30 (మనం న్యూస్) :** కృష్ణాజిల్లా వ్యాప్తంగా నేర నివారణలో ప్రజలను భాగస్వాములుగా మార్చేందుకు పల్లెనిద్ర కార్యక్రమం గొప్ప వేదికగా మారుతుందని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. మంగళవారం రాత్రి అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్పీ గంగాధర్ పోలీసు సిబ్బందితో కలిసి పల్లెనిద్ర చేశారు. ముందుగా పులిగడ్డ గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ అధ్యక్షతన గ్రామస్తులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు శాంతియుత జీవనంలో కొనసాగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేందుకి గ్రామీణ ప్రాంతాలలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. గ్రామాలలో ప్రజలు గొడవలకు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని, గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ రాజకీయాలకు అతీతంగా ఉండి గ్రామాభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

పల్లెనిద్ర ద్వారా గ్రామాలలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ఆయా గ్రామాలలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉందని అన్నారు. గ్రామాలలో, రద్దీ ప్రాంతాలలో, వ్యాపార, గృహ సముదాయాలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, తద్వారా నేర నివారణకు తోడ్పడాలని అన్నారు. ఉదాహరణగా గతంలో పులిగడ్డ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన దొంగతనంలో సీసీటీవీ కెమెరాల వలనే దొంగలను పట్టుకోవడం సాధ్యమైందని అన్నారు.


## విజయవాడలో భూకబ్జాతో బెంబేలెత్తుతున్న భూ యజమానులు



**విజయవాడ తూర్పు, జూలై 30 (మనం న్యూస్)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 42 మంది ఇంటి స్థలం యజమానులు ఆందోళన చేస్తున్నారని విజయవాడ మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ అన్నారు. బుధవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2001 లో కొనుగోలు చేసిన 2 ఎకరాల 40 సెంట్ల స్థలం కబ్జాకు గురయిందన్నారు. 42 మంది బాధితులకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ భరోసాతో వారు విరమణ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ భవానిపురం జ్యోజీ నగర్ లో వంద కోట్లు రూపాయలు విలువ కలిగే స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నం జరిగిందన్నారు. నియోజవర్గంలో ఉన్న కొంతమంది దుష్టశక్తులు తుళ్లూరు రిజిస్టర్ ఆఫీస్ కి వెళ్లి రెండు ఎకరాల 40 సెంట్లు స్థలాన్ని దొంగతనంగా రిజిస్ట్రేషన్ ఎందుకు చేశారని ప్రశ్నించారు. గత నెల రోజుల నుండి 42 మంది బాధ్యతలు వారి ప్లాట్లు వారికి దక్కేందుకు న్యాయ బద్ధంగా ఆందోళన చేస్తున్నారన్నారు. వారికి తాము అండగా నిలుస్తామన్నారు. గతంలో విశాఖ, హైదరాబాదు లాంటి నగరాలలో పేదలను మోసం చేసే సంస్కృతి ఉండేదన్నారు. అలాంటి విష సంస్కృతి విజయవాడ నగరానికి కూడా వచ్చిందన్నారు. పేదలు చెమటోడ్చి ప్లాట్లు కొనుగోలు చేసుకుని, కార్పొరేషన్ వద్ద అనుమతులు తీసుకుని ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారన్నారు. కొంత మంది వ్యక్తులు రాజకీయం ముసుగులో పేదల ఆస్తిని దక్కించుకోవాలని అడ్డదారులు తొక్కుతున్నా రన్నారు. గత నెల రోజుల నుండి బాధితులు ఆందోళన చేస్తున్నారన్నారు. 42 మంది బాధితులకు అండగా ఉంటామన్నారు. ఖాళీ స్థలాలను కబ్జా చేసే కోట్లు దండుకునే ముఠాపై పోలీసు యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న నియోజకవర్గాన్ని కబ్జాలు పేరుతో అలజడి సృష్టించే వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలలో ఇచ్చిన హమీలు నెరవేరుస్తూ సంక్షేమ పథకాలు అమలు

- జి.మధుసూదన్ రెడ్డి



**మహబూబ్ నగర్ 30 జులై, (మనం న్యూస్):** ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సూధన్ రెడ్డి అన్నారు.బుధవారం దేవరకద్ర పట్టణంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తో కలిసి ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని దేవరకద్ర మండలం లోని పేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇబ్బందులు తొలగించేందుకు రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేస్తుందని అన్నారు.గత 10 సంవత్సరాలు పరిపాలించిన టి ఆర్.ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు,కొత్తగా వచ్చిన కుటుంబ సభ్యులను చేర్చి కొత్త కార్డులు మంజూరు చేయలేదని అన్నారు.రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో బియ్యం,ఆరోగ్య శ్రీ పథకాలు ఇందిరమ్మ వర్తించక ఇబ్బందులు పడ్డారని అన్నారు.పేదల ఇబ్బందులు దూరం చేసేందుకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు ప్రజా పాలన గ్రామ సభల్లో,మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి 17428 వేల కొత్త రేషన్ కార్డులు,సుమారు లక్ష 10 వేల కుటుంబ సభ్యుల పేర్లు చేర్చి కొత్త కార్డులను మంజూరు చేసినట్లు,దేవరకద్ర మండలం లో 106 మందికి కొత్త రేషన్ కార్డులు,2298 మంది కుటుంబ సభ్యులను కొత్తగా చేర్చి కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హత గల ప్రతి లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గత టి.అర్.ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూం లు నిర్మాణం చేస్తానని చెప్పి మోసం చేసిందని,కాంగ్రెస్ ప్రభుత్వం దేవరకద్ర నియోజకవర్గం లో 3500 ఇండ్లు మంజూరు చేసిందని,భూమి పూజ చేసుకుని ఇండ్ల నిర్మాణాలు చేసుకుంటున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు రాని వారికి రెండవ విడతలో మంజూరు చేయనున్నట్లు తెలిపారు.మహిళల పేరు మీదనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.మహిళా సంఘాలలో సభ్యులు చనిపోతే 10 లక్షల భీమా చెల్లిస్తున్నట్లు మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్ లు,అర్.టి. సి.కి అద్దె బస్సులు ద్వారా ఆదాయం,పెట్రోల్ బంక్ లు నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు.అర్.టి.సి ద్వారా మహిళలకు 200 కోట్ల జీరో టికెట్ తో ఉచిత ప్రయాణాలు చేసినట్లు,ఇందుకు గాను ప్రభుత్వం 6300 కోట్ల రూ.లు చెల్లించించని అన్నారు. దేవరకద్ర మున్సిపాలిటీకి అత్యవసర పనులు నిమిత్తం 3 కోట్ల రూ.లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు,వారం రోజుల్లో 15 కోట్లు రూ.లు మంజూరు కానున్నట్లు,20 కోట్లతో త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. దేవరకద్ర పట్టణం ను 4 గ్రామాలు కలిపి మున్సిపాలిటీ గా చేసుకున్నట్లు,రానున్న రోజుల్లో దేవరకద్ర పట్టణం రూపు రేఖలు మార్చి ఆదర్శవంతమైన మున్సిపాలిటీ గా రూపొందించేందుకు ప్రజలు సహకరించాలని అన్నారు.దేవరకద్ర పట్టణం లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసుకుని తరగతులు నిర్వహిస్తున్నట్లు, స్థలం సేకరణ చేసి భవనం నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. దేవరకద్ర పట్టణం లో 100 పడకల ఆసుపత్రి సంవత్సరం లోగా నిర్మాణం చేసుకుని అన్ని వసతులతో వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు .

# వరుస సెంచరీలతో చెలరేగిపోతున్న కేన్ విలియమ్సన్



న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్ లో చెలరేగిపోతున్నాడు. వరుస సెంచరీలతో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాడు. ఈ సీజన్ తోనే మిడిల్ సెక్స్ తో జతకట్టిన కేన్.. అరంగేట్రం మ్యాచ్ లో సెంచరీ చేసి, తాజాగా రెండో మ్యాచ్ లోనూ శతకం నమోదు చేశాడు. కేన్ మామకు ఇది ఫస్ట్ క్లాస్ కెరీర్ లో 45వ శతకం. గ్లోసెస్టర్ షైర్తో నిన్న (జులై 29) మొదలైన మ్యాచ్ లో కేన్ 112 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 104 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. ఇవాళ రెండో రోజు ఆట ప్రారంభం కావాల్సి ఉంది. కేన్ అరంగేట్రం మ్యాచ్ లో నార్తంప్టన్ షైర్ పై 159 బంతుల్లో 14 ఫోర్లు, సిక్సర్ సాయంతో 114 పరుగులు చేశాడు. ఆ మ్యాచ్ లో మిడిల్ సెక్స్ ఇన్నింగ్స్ 107 పరుగుల తేడాతో విజయం సాధించింది.

## సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం

భారత అగ్రశ్రేణి డబుల్స్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశారు. మంగళవారం పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో రెండో సీడ్ సాత్విక్-చిరాగ్ జోడీ 21-13, 21-15తో హాంగ్ యీ- ఇంగ్ చియాంగ్ (మలేసియా) జంటపై విజయం సాధించింది. భారత ద్వయం కేవలం 36 నిమిషాల్లోనే ప్రత్యర్థి జంటను చిత్తుచేసి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.



### మళ్లీ టాప్-10లోకి

సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ ప్రపంచ బ్యాడ్మింటన్ డబుల్స్ ర్యాంకింగ్స్ లో మళ్లీ టాప్-10లోకి అడుగుపెట్టింది. మంగళవారం బీడబ్ల్యూఎఫ్ ప్రకటించిన జాబితాలో మూడు స్థానాలు మెరుగుపరుచుకున్న భారత ద్వయం తొమ్మిదో ర్యాంకు సాధించింది. గతంలో నంబర్వన్ ర్యాంకు సాధించిన భారత జోడీ.. గాయాల కారణంగా ఆటకు దూరమై ర్యాంకింగ్లో వెనుకబడింది. అయితే ఈ సీజన్ లో మూడు ప్రపంచ టూర్ టోర్నీల్లో సెమీస్ చేరుకోవడంతో భారత జోడీ ర్యాంకింగ్ మెరుగైంది. పురుషుల సింగిల్స్ లో లక్ష్యసేన్ 17, మహిళల సింగిల్స్ లో పి.వి.సింధు 15, మహిళల డబుల్స్ లో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీ 11వ స్థానాల్లో కొనసాగుతున్నారు.



# చరిత్ర సృష్టించిన టీమిండియా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. తాజాగా (జులై 30) విడుదల చేసిన ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్ లో అగ్రస్థానానికి ఎగబాకాడు. తద్వారా విరాట్ కోహ్లి, గౌతమ్ గంభీర్, సూర్యకుమార్ యాదవ్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో భారత బ్యాటర్ గా రికార్డుల్లోకెక్కాడు.

ర్యాంకింగ్స్ లో టాప్ ప్లేస్ కు చేరే క్రమంలో అభిషేక్ ఆసీస్ స్టార్ బ్యాటర్ ట్రవిస్ హెడ్ ను కిందకు దించాడు. ప్రస్తుతం అభిషేక్ ఖాతాలో 829 రేటింగ్ పాయింట్లు ఉండగా.. హెడ్ వద్ద 814 పాయింట్లు ఉన్నాయి. ర్యాంకింగ్స్ లో మూడో స్థానంలో కూడా భారత బ్యాటరే ఉన్నాడు. 804 రేటింగ్ పాయింట్లతో తిలక్ వర్మ ఆ స్థానంలో కొనసాగుతున్నాడు.

టాప్-10లో భారత్ టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా ఉన్నాడు. స్కై ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు.

గత వారం ర్యాంకింగ్స్ లో టాప్-10లో ఉండిన మరో భారత బ్యాటర్ యశస్వి జైస్వాల్ (9) తాజా ర్యాంకింగ్స్ లో రెండు స్థానాలు కోల్పోయి 11వ స్థానానికి పడిపోయాడు. భారత బ్యాటర్లలో రుతురాజ్ గైక్వాడ్ 25, సంజూ శాంసన్ 33, శుభ్ మన్ గిల్ 38, హార్దిక్ పాండ్యా 53, రింకూ సింగ్ 56, శివమ్ దూబే 61 స్థానాల్లో ఉన్నారు.

టాప్-10లో అభిషేక్, హెడ్, తిలక్ తర్వాత సాల్ట్, బట్లర్, నిస్సంక, సీఫర్ట్, ఇంగ్లిస్, హోప్ ఉన్నారు. ఈ వారం ర్యాంకింగ్స్ లో ఆసీస్ బ్యాటర్లు ఇంగ్లిస్, టిమ్ డేవిడ్, కెమరూన్ గ్రీన్ బాగా లబ్ది పొందారు. వీరిలో గ్రీన్ ఏకంగా 64 స్థానాలు మెరుగుపర్చుకొని 24 స్థానానికి ఎగబాకాడు. గ్రీన్ తాజాగా వెస్టిండీస్ తో ముగిసిన ఐదు మ్యాచ్ ల సిరీస్ లో విశేషంగా రాణించాడు.


### సహచరుడు గిల్ కూడా టాప్ లోనే..!

టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్ లో అభిషేక్ టాప్ ర్యాంక్ కు చేరగా.. అతని ఆప్త మిత్రుడు శుభ్ మన్ గిల్ వన్డేల్లో టాప్ ప్లేస్ లో కొనసాగుతున్నాడు. వీరిద్దరు టీమిండియా దిగ్గజం యువరాజ్ సింగ్ దగ్గర శిష్యరికం చేస్తుండటం విశేషం. అభిషేక్, గిల్ టీ20, వన్డే ఫార్మాట్లలో నంబర్ వన్ బ్యాటర్లుగా ఉండగా.. భారత్ రెండు ఫార్మాట్లలో నంబర్ వన్ జట్టుగా కొనసాగుతుంది.

అలాగే టెస్టో నంబర్ వన్ బౌలర్ గా బుమ్రా, నంబర్ వన్ ఆల్ రౌండర్ గా రవీంద్ర జడేజా, నంబర్ వన్ టీ20 ఆల్ రౌండర్గా హార్దిక్ పాండ్యా కొనసాగుతున్నారు.



# నేను ఎవరికీ భయపడను – విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ హీరోగా వస్తోన్న మోస్ట్ అవైటేడ్ మూవీ కింగ్ డమ్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ సినిమా విడుదలకు అంతా సిద్ధమైంది. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్ రిలీజ్ తర్వాత కింగ్ డమ్ పై ఒక్కసారిగా బజ్ క్రియేట్ అయింది. సినిమా రిలీజ్ కు ఒక్కరోజు మాత్రమే టైమ్ ఉండడంతో తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విజయ్ దేవరకొండ ఆసక్తికర కామెంట్స్ చేశారు. తానెప్పుడు ఎవరికోసమే మారనని.. ఎవరికీ భయపడనని అన్నారు.

విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'నేనెప్పుడు లోపల ఏది అనిపిస్తే అదే మాట్లాడతా.. కెరీర్ ప్రారంభంలో అగ్రెసివ్ గా ఉన్నా. అప్పుడు నాలో డిఫెన్స్ మెకానిజంతో ఉండేవాన్ని. ఎవరూ నన్ను తక్కువ చేసి మాట్లాడకూడదు. నన్ను నేను ప్రొటెక్ట్ చేసుకోవాలి. నేను అనుకున్నది సాధించాలి. అందుకే కెరీర్ ప్రారంభంలో దూకుడుగా ఉన్నానేమో. మనం సినిమాల్లోనూ చూస్తుంటాం కదా.. హీరో ముందుగా పవర్ ఫుల్ గా ఉంటాడు. అమ్మ, అమ్మాయి ఎవరో ఒకరి వల్ల తర్వాత సాఫ్ట్ అయిపోతాడు.' అని అన్నారు. ఆ తర్వాత మాట్లాడుతూ..'ఇప్పుడు నా అభిమానుల ప్రేమతో నేను కూడా సాఫ్ట్ అయిపోయా. ఇప్పుడైతే నాకేలాంటి ఫియర్ లేదు. మొదట్లో నాకు కొద్దిగా భయముండేది. ఇప్పుడైతే అలాంటిదేం లేదు. నా చుట్టూ ఉండే వాతావరణం వల్లే అలాంటి ఫీలింగ్ వచ్చి ఉండొచ్చు. ఇప్పుడైతే ఆడియన్స్ లవ్ వల్ల ఫియర్ పోయి ప్రశాంతంగా ఉన్నా' అని విజయ్ దేవరకొండ తెలిపారు.

# కోలీవుడ్‌లో ఫుల్ బిజీగా తెలుగమ్మాయి




నటి బిందు మాధవి. ఈ పేరు పక్కింటి అమ్మాయి అనే ఇమేజ్ ను సొంతం చేసుకుంది. ఇంతకు ముందు పలు భాషల్లో, చిత్రాల్లో కథానాయికిగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. ముఖ్యంగా పదహారు అణాల తెలుగు అమ్మాయి. తెలుగు బిగ్ బాస్ విన్నర్ అయిన బిందు మాధవి.. తమిళంలోనే ఎక్కువ సినిమాలు చేశారు. కళగు, కేడీ బిల్లా కిలాడి రంగా, తమిళుక్కు ఎన్ ఒంద్రు అళిక్కవుమ్ వంటి పలు హిట్ చిత్రాల్లో నటించారు. అలా 2019 వరకు వరుసగా చిత్రాలు చేసిన బిందు మాధవి ఆ తరువాత కారణాలు ఏమైనా వెండి తెరపై కనిపించలేదు. అలాంటిది మళ్లీ 2024లో మాయన్ చిత్రంతో ఒక రకంగా రీ ఎంట్రీ అయ్యారనే చెప్పవచ్చు. ప్రస్తుతం బ్లాక్ మెయిల్, యారుక్కుమ్ అంజాల్ పగైవనుక్కు అరుళ్వై మొదలగు మూడు చిత్రాల్లో నటిస్తూ బిజీ అయ్యారు. అందులో ఒకటి బ్లాక్ మెయిల్. జీవీ ప్రకాష్ కుమార్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి ఎం.మారన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు ఒకటవ తేదీన తెరపైకి రానుంది. ఈ సందర్భంగా బ్లాక్ మెయిల్ చిత్రంలో నటించిన అనుభవం గురించి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ ప్రతి కళాకారుడు కళాకారుని తమ జీవితాల్లో ఒక మార్పు తీసుకువచ్చే తరుణం కోసం ఎదురుచూస్తూనే ఉంటారన్నారు అదేవిధంగా మహిళలు తమకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందడం కోసం సవాళతలను ఎదుర్కొంటారన్నారు.

అలా దర్శకుడు ఎం మారన్ బ్లాక్మెయిల్ కథను చెప్పగానే అది తనకు బాగా కనెక్ట్ అయిన భావన కలిగిందన్నారు. అది తన కోసమే ఎదురుచూస్తున్న పాత్రగా భావించానన్నారు. దర్శకుడు రాసిన బలమైన , భావోద్వేగాలతో కూడిన ఆ పాత్ర తనలో బాధ్యతను పెంచిందన్నారు. ముఖ్యంగా పలు కథాపాత్రలతో కలిసి తన పాత్ర ఉంటుందన్నారు. జీవీ ప్రకాష్ లాంటి అద్భుతమైన నటనను ప్రదర్శించే నటుడుతో కలిసి పనిచేయటం మంచి అనుభవంగా పేర్కొన్నారు. నటి తేజు అశ్విని ,శ్రీకాంత్ తదితర నటీనటులందరూ తమ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారన్నారు భావోద్రేకాలతో కూడిన ఉత్సాహబహితమైన థ్రిల్లర్ కథాచిత్రంగా ఉంటుందని నటి బిందు మాధవి పేర్కొన్నారు.

# వార్-2 నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో.. ఫుల్ సాంగ్ ఎప్పుడంటే!

బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ అలాగే మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కలయికలో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం వార్ 2 కోసం అందరికీ తెలిసిందే. నార్త్ నుంచి సౌత్ వరకు భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి ఎట్టకేలకి ఫస్ట్ సింగిల్ పై క్లారిటీ వచ్చింది. మేకర్స్ లేటెస్ట్ గా హృతిక్ రోషన్ మరియు హీరోయిన్ కియారా అద్వానీలపై ప్లాన్ చేసిన ఫస్ట్ సింగిల్ తాలూకా మూడు భాషల ప్రోమోని ఇప్పుడు విడుదల చేశారు. డీసెంట్ గా సాగుతున్న ఈ రొమాంటిక్ సాంగ్ ని అనౌన్స్ చేశారు. ఇక ఈ ఫుల్ సాంగ్ ని రేపు అక్టోబర్ 31న విడుదల చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేసేసారు. ఇక ఈ చిత్రానికి ప్రీతమ్ సంగీతం అందిస్తుండగా యష్ రాజ్ ఫిలమ్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ ఆగస్ట్ 14న సినిమా గ్రాండ్ గా విడుదల కాబోతుంది.



# రిషబ్ శెట్టితో నాగవంశీ బిగ్ ప్రాజెక్ట్.. కాన్సెప్ట్ పోస్టర్‌తోనే సాలిడ్ హైప్

కన్నడ స్టార్ నటుడు అలాగే దర్శకుడు రిషబ్ శెట్టి హీరోగా ఇపుడు కన్నడ, హిందీ సహా తెలుగులో కూడా పలు సాలిడ్ ప్రాజెక్ట్ లు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రాల్లో లేటెస్ట్ గా మరో భారీ ప్రాజెక్ట్ యాడ్ అయ్యింది. అది కూడా మన టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ నిర్మాత నాగవంశీ కాంబినేషన్ లో ఇప్పుడు ప్రతిష్టాత్మకంగా అనౌన్స్ చేశారు. ఒక ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్ పోస్టర్ తో తమ బ్యానర్ లో 36వ సినిమాగా దీనిని అనౌన్స్ చేయడం జరిగింది. అయితే ఈ చిత్రాన్ని దర్శకుడు అశ్విన్ గంగరాజు తెరకెక్కిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కాన్సెప్ట్ పోస్టర్ చూస్తే ఒక భారీ యుద్ధ సన్నివేశం చుట్టూ తుపాకులు మధ్యలో ఒక మనిషిని ముసుగు కప్పుకొని వెనుక రెండు కత్తులుతో నిలబెట్టినట్టు కనిపిస్తుంది. అలాగే ఈ టోన్ చూస్తే సినిమా భారీ పీరియాడిక్ సినిమాలా కూడా అనిపిస్తుంది. మొత్తానికి మాత్రం సితార కాంపౌండ్ నుంచి ఇదొక బిగ్ ప్రాజెక్ట్ అని చెప్పవచ్చు. ఇక దీనిపై మరిన్ని డీటెయిల్స్ బయటకి రావాల్సి ఉన్నాయి.



# విశ్వంభర సెట్స్‌లో చిరుతో నాగిని

మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష, ఆషిక రంగనాథ్ లు హీరోయిన్స్ గా దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న భారీ చిత్రమే విశ్వంభర. విజువల్ ఎఫెకట్స్ పరంగా లేట్ అవుతూ వస్తున్న ఈ సినిమాలో రీసెంట్ గానే ఓ సాంగ్ షూటింగ్ కోసం బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ మౌని రాయ్ నటిస్తుంది అనే టాక్ బయటకి వచ్చింది. మొన్నీమధ్య ఓ వీడియో కూడా బయటకి వచ్చింది.



అయితే ఈ స్పెషల్ సాంగ్ కి సంబంధించి మౌని రాయ్ ఓ పోస్ట్ తో తన ఎగ్జైట్మెంట్ ని షేర్ చేసుకుంది. మెగాస్టార్ చిరంజీవితో కలిసి దిగిన పిక్ ని మొదటిగా షేర్ చేసిన నటి మౌని రాయ్ తన సోషల్ మీడియాలో నేరుగా విశ్వంభర సెట్స్ నుంచే మెగాస్టార్ తో కలిసి ఉన్న పిక్స్ ని షేర్ చేసుకుంది. మెగాస్టార్ తో డాన్స్ చేయడం ఎంతో ఆనందంగా మాత్రమే కాకుండా హానర్ గా కూడా భావిస్తున్నాను అని తెలిపింది.

అలాగే డాన్స్ మాస్టర్ గణేష్ ఆచార్య ఇతర విశ్వంభర టీం అందరికీ స్పెషల్ థాంక్స్ ని నాగిని చెప్పుకొచ్చింది. ఇలా ఈ క్రేజీ పోస్ట్ తో విశ్వంభర లో స్పెషల్ సాంగ్ పట్ల మరిన్ని అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ సాంగ్ ఎప్పుడు వస్తుంది ఏంటి అనేవి ఇంకా బయటకి రావాల్సి ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.